ANN తెలుగు

Follow: @ANNTELUGU

01-09-2025

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 268 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## కేసీ వేణుగోపాల్ అండతో తెలంగాణ అభివృద్ధిపై ఫోకస్

### యువత రాజకీయాల్లోకి రావాలి

బీజేపీ యువత హక్కులను కొల్లగొడుతోంది

బీజేపీ సర్కార్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైర్

ఎంపీ మెరిట్ అవార్డు కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు

**కేరళ, మహా:** దేశంలో వంద శాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రం కేరళ అని, ఈ రాష్ట్రంలో అమలు చేస్తున్న వయోజన విద్యా కార్యక్రమం అన్నిరాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 21 ఏళ్ల వయసున్న యువత ఎమ్మెల్యేలుగా ఎందుకు పోటీ చేయకూడదన్నారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### మీ చరిత్ర అంతా బయటికి తీస్తాం

- హరీష్ పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫైర్



02

### హెచ్‌ఎంఎస్ గౌరవాధ్యక్షురాలిగా కవిత

- బీఆర్ఎస్ బొగ్గు సంఘానికి షాక్



05

### కల్వకుంట్ల కాదు, కలవకుండా చేసే ఫ్యామిలీ

- అసెంబ్లీలో రేవంత్ రెడ్డి



02




# సీబీఐకి కాళేశ్వరం

## అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ సంచలన ప్రకటన

అర్ధరాత్రి 1.40 దాకా సభలో చర్చ

కాంగ్రెస్ ప్రభుత్వానిది అంతా పొలిటికల్ డ్రామా మాజీ మంత్రి హరీష్

డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా కాళేశ్వరం కట్టారు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కాళేశ్వరం అంచనాలు పెంచారు.. మల్లు భట్టి విక్రమార్క ఫైర్


మామ చెప్పినట్టే .. అల్లుడు చేశాడు.. మీ చిట్టా అంతా తీస్తాం మంత్రి పొంగులేటి ధ్వజం

శిక్షలు తప్పించుకోడానికి హరీష్ రావు డ్రామాలు.. మంత్రి కోమటిరెడ్డి ఫైర్

జోషి, స్మిత, రామకృష్ణారావు కూడా బాధ్యులేనని రిపోర్ట్ లో ఉంది..

ప్రమోషన్ ఎలా ఇచ్చారు బిజెఎల్పీనేత మహేశ్వరరెడ్డి

సభలో సవాళ్ళు.. బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళన



కాళేశ్వరం కేసును సిబిఐకి అప్పగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. కాళేశ్వరంపై చర్చ ఆదివారం అసెంబ్లీలో హాట్ హాట్ గా సాగింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం కాళేశ్వరం వెనుక దురుద్దేశం ఉందని, లక్షకోట్ల దోపిడీ కోసమే ప్రాజెక్టు చేపట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. సాయంత్రం 4గంటల సమయంలో కాళేశ్వరంపై చర్చ ప్రారంభం కాగా, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రిపోర్టులో పేర్కొన్న అంశాల ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, హరీష్ రావు, అప్పటి అధికారుల తప్పులతోనే ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. డ్యామ్ కు, బ్యారేజీకి తెలియకుండా ప్రాజెక్టు కట్టారంటూ తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. ఆదివారం సభ వెనుకే పెద్ద డ్రామా ఉందని హరీష్ రావు ఆరోపించగా, మంత్రులు తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. బీఆర్ఎస్ నుండి హరీష్ రావు గంటా 20నిమిషాలు మాట్లాడగా, హరీష్ రావే ఇందులో తప్పుచేశారని కమిషన్ స్పష్టంగా పేర్కొందని ముఖ్యమంత్రి చెప్పారు. కాళేశ్వరంపై హాట్ హాట్ గా చర్చ జరగ్గా.. ముఖ్యమంత్రి, మంత్రులు కాళేశ్వరంలో దురుద్దేశం ఉందన్న అంశాన్ని బలంగా తీసుకెళ్ళగలిగారు. - మహా, హైదరాబాద్

వివరాలు 2లో

# బీసీల రిజర్వేషన్లకు లైన్‌క్లియర్

## మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులకు ఆమోదం

బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి సీతక్క

గత ప్రభుత్వచట్టమే గుదిబండ సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

నేడు బిల్లు ఆమోదించాలని గవర్నర్ ను కలవనున్న అఖిలపక్షం

42శాతం బీసీ రిజర్వేషన్లకు వెళ్తాం మంత్రి పొన్నం



**హైదరాబాద్, మహా :**

మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంది. మంత్రి సీతక్క ముందుగా మున్సిపల్, తర్వాత పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, సభ ఆమోదం తెలిపింది. అనంతరం వాటి గురించి చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రసంగిస్తూ, ఆర్థిక అసమానతలు తొలగాలంటే ఉపాధి కూడా ఉండాలని పేర్కొన్నారు. చిత్తశుద్ధి ఉండటం వల్లే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై బిల్లు తెచ్చామన్నారు. 2018లో పంచాయతీరాజ్ చట్టంలో 50 శాతం రిజర్వేషన్లపై సీలింగ్ పెట్టామని అన్నారు. ఏ రాష్ట్రంలో రిజర్వేషన్లపై సీలింగ్ విధిస్తూ చట్టాలు లేవని పేర్కొన్నారు. తెలంగాణలో ఉన్న సీలింగ్‌ను సవరించేందుకు మళ్లీ బిల్లు ప్రవేశపెట్టామని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన 50 శాతం సీలింగ్‌ను తొలగించే సవరణ కోసమే బిల్లు తీసుకొచ్చామన్నారు.

మిగతా 2లో

### సెప్టెంబర్ 10న నోటిఫికేషన్?

- 24, 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే అవకాశం
- దసరా లోగా ముగించే యోచన
- ఎన్నికల కమిషన్ కు తేదీలు పంపనున్న సర్కార్
- బీసీలకు 42శాతంపై ధీమా.. 31 జడ్పీలు, 566 మండలాలకు ఎన్నికలు

వివరాలు 3లో

### అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్

కాళేశ్వరం రిపోర్టును డస్ట్ బిన్‌లో పడేసిన ఎమ్మెల్యేలు

02



### వరద బాధితులు అధైర్యపడొద్దు

- జైనథ్, బేల మండలాల్లో కంది శ్రీనివాసరెడ్డి పర్యటన
- నష్టపోయిన పంటపొలాలు, దెబ్బతిన్న రోడ్ల పరిశీలన
- కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా

వివరాలు 5లో

# విజయం సాధించాం

## బీసీ రిజర్వేషన్లు అమలు చేసే ఘనత మాదే..

ప్రభుత్వ పథకాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఏఐసీసీ జూమ్ మీటింగ్‌లో మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మహా:** బీసీ రిజర్వేషన్లు అమలు చేసే ఘనత కాంగ్రెస్ పార్టీదే అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. డీసీసీ అధ్యక్షులు, పీసీసీ ఆఫీస్ బేరర్లు, కార్పొరేషన్ చైర్మన్ లతో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ మీనాక్షి నటరాజన్ జూమ్ మీటింగ్ లో మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.' 10 ఏళ్ళు అధికారంలో ఉండి కేసీఆర్ బీసీలను అనగదొక్కారు.. కేసీఆర్ చేసిన బిసి బిల్లు బిసిలకు మరణ శాసనం అయ్యింది. బీసీ కులఘనన చేసి పకడ్బందీగా గా బిసి బిల్లు తెచ్చి బీసీలకు రాజకీయ సుస్థిర స్థానం కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ ది.

మిగతా 2లో

### పంచాయతీ నిధులపై డ్రై

పంచాయతీరాజ్, మున్సిపల్ సవరణల బిల్లు చర్చ

2లో

### గంగుల వర్సెస్ పొన్నం

- మాజీ మంత్రి, మంత్రి మధ్య అసెంబ్లీలో వార్
- బీసీలపై పొన్నంకు అవగాహన లేదన్న గంగుల కమలాకర్
- ఆ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు అభ్యంతరం
- ఆకారంలో పెద్దగా ఉంటే అవగాహన ఎక్కువ ఉంటదనుకుంటే పొరపాటే అంటూ పొన్నం కౌంటర్
- నేను కూడా బాడీ షేమింగ్ గురించి మాట్లాడితే పెద్ద కాంట్రావర్సి అవుతదన్న కమలాకర్

2లో









# సీబీఐకి కాళేశ్వరం



(హైదరాబాద్ - మహా)

కాళేశ్వరం కేసును సిబిఐకి అప్పగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. కాళేశ్వరంపై చర్చ ఆదివారం అసెంబ్లీలో హాట్ హాట్ గా సాగింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం కాళేశ్వరం వెనుక దురుద్దేశం ఉందని, లక్షకోట్ల దోపిడీ కోసమే ప్రాజెక్టు చేపట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. సాయంత్రం 4గంటల సమయంలో కాళేశ్వరంపై చర్చ ప్రారంభం కాగా, నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రిపోర్టులో పేర్కొన్న అంశాల ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, హరీష్ రావు, అప్పటి అధికారుల తప్పులతోనే ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. డ్యామ్ కు, బ్యారేజీకి తెలియకుండా ప్రాజెక్టు కట్టారంటూ తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. ఆదివారం సభ వెనుకే పెద్ద డ్రామా ఉందని హరీష్ రావు ఆరోపించగా, మంత్రులు తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. బీఆర్ఎస్ నుండి హరీష్ రావు గంటా 20నిమిషాలు మాట్లాడగా, హరీష్ రావే ఇందులో తప్పుచేశారని కమిషన్ స్పష్టంగా పేర్కొందని ముఖ్యమంత్రి చెప్పారు. కాళేశ్వరంపై హాట్ హాట్ గా చర్చ జరగ్గా.. ముఖ్యమంత్రి, మంత్రులు కాళేశ్వరంలో దురుద్దేశం ఉందన్న అంశాన్ని బలంగా తీసుకెళ్ళగలిగారు.

## హరీష్ దే తప్పు - సీఎం రేవంత్ రెడ్డి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఆ పార్టీ నేతలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. మాజీ నీటిపారుదల శాఖ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కీలక నేత హరీష్ రావు అసంపూర్తి సమాచారంతో తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2015, మార్చి 13వ తేదీన కేంద్ర మంత్రి ఉమా భారతి.. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత ఉందని లేఖ రాశారని సీఎం తెలిపారు. 205 టీఎంసీల నీటి లభ్యత ఉందని ఆమె చెప్పినట్లు సభకు వెల్లడించారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టుకోవాలని అప్పటి కేంద్ర మంత్రి చెప్పారన్నారు. రికార్డులను తొక్కిపెట్టి ప్రాజెక్ట్ డిజైన్ మార్చారంటూ బీఆర్ఎస్ పై ముఖ్యమంత్రి రేవంత్ మండిపడ్డారు. 'హరీష్ రావు తప్పు చేశారని కాళేశ్వరం కమిషన్ చెప్పింది. వాస్తవాలు బయటపెట్టారు కాబట్టే కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారు. చర్చను తప్పుదోవ పట్టించొద్దు. మీరు ఏం విచారణ కోరుకుంటున్నారో చెప్పండి. ఈడీ, సీబీఐ, సిట్, సీఐడీ ఏది కావాలో చెప్పండి. రాష్ట్రాన్ని దోపిడీ చేసి మళ్లీ తప్పుదారి పట్టిస్తున్నారు. ప్రాణహితలో నీళ్లు ఉన్నాయని ఉమాభారతి లేఖలో ఉంది. నీళ్లు ఉన్నాయని చెప్పిన తర్వాత మళ్లీ ఎందుకు అడిగారు. తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టుకు మహారాష్ట్ర అభ్యంతరం చెప్పలేదు. అప్పట్లో చర్చంతా ప్రాజెక్టు ఎత్తు గురించే జరిగింది. 148 మీటర్ల ఎత్తులో కట్టుకోవాలని మహారాష్ట్ర చెప్పింది. ప్రాజెక్టు లొకేషన్ ఎందుకు మార్చారో చెప్పండి. కేసీఆర్‌కు ధనాశ, దురాశ కలిగినట్లున్నాయి. రూ.లక్ష కోట్లు కొల్లగొట్టాలనే దురుద్దేశంతోనే కాళేశ్వరం నిర్మాణం జరిగింది. రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ నివేదికను కావాలనే తొక్కిపెట్టారు. అన్ని అంశాలపై చీఫ్ ఇంజినీర్ హరిరామ్ స్పష్టంగా చెప్పారు. ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారని కమిషన్ నివేదిక చెప్పింది. ఆంధ్రా పాలనలో అన్యాయం జరిగింది కాబట్టే తెలంగాణ తెచ్చుకున్నాం. ఏనుగులను తినేవాళ్లు పోయారు.. పీనుగులను తినేవాళ్లు వచ్చారు. నిజాలు తెలుస్తాయనే నివేదికపై చర్చను అడ్డుకుంటున్నారు. మీరు చేసిన తప్పులు ఎంత దాచాలన్నా దాగవు. అర్ధరాత్రి 2 గంటల వరకైనా చర్చకు సిద్ధం' అని అన్నారు.

# పొలిటికల్ డ్రామా.. హరీష్ రావు ఫైర్



కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేసి, తమకు మాట్లాడే అవకాశం ఇవ్వరా అని ప్రశ్నించారు. 660 పేజీల నివేదికపై అరగంటలోనే అన్నీ మాట్లాడాలంటే ఎలా? ఇది సాధ్యమయ్యే పనేనా? అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై చర్చ సందర్భంగా హరీశ్‌రావు అసెంబ్లీలో మాట్లాడారు. "నాకు రెండు గంటల సమయం ఇవ్వాలి. మధ్యలో జోక్యం చేసుకోవద్దు. ఆదివారం రోజు సభలో నివేదిక పెట్టారంటేనే వారి ఉద్దేశం అర్థమవుతోంది. కోర్టుకు వెళ్లడం మాకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. గతంలో ఇలాంటి విషయాలపై ఇందిరాగాంధీ, అద్వాణీ కూడా కోర్టుకు వెళ్లారు. ఆదరాబాదరాగా ఆదివారం సభలో పెట్టారంటేనే మీ కుట్రలు అర్థమవుతున్నాయి. మీరు చేసిందంతా పొలిటికల్ డ్రామా అని తెలుస్తోంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ దర్యాప్తు నిష్పాక్షికంగా జరిగిందా? లేదా? అనే విషయం తేలాలి. నిష్పాక్షికంగా జరగకపోతే ఆ కమిషన్ నివేదిక చిత్తుకాగితమని సుప్రీంకోర్టు చెప్పింది. ఆరోపణలపై కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్‌లో స్పష్టంగా చెప్పారు. సభ్యులకు 8బీ, 8సీ కింద నోటీసులు ఇవ్వాలని చట్టంలో స్పష్టంగా ఉంది. 8బీ కింద నోటీసులు ఇవ్వకపోతే ఆ కమిషన్ నివేదికలు చెల్లవని సుప్రీం కోర్టు చెప్పింది. ఎమర్జెన్సీపై విచారణ జరపాలని షా కమిషన్ వేశారు. దానిపై దేశమంతా కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెట్టారు. షా కమిషన్‌ను ఆనాడు నోటికి వచ్చినట్లు కాంగ్రెస్ నేతలు తిట్టారు. చట్టాలను తుంగలో తొక్కుతూ ఏకపక్షంగా ఈ కమిషన్ ఇచ్చారు. 8బీ నోటీసులు ఇవ్వకుండా నివేదిక ఇచ్చారని ఆరోజు సుప్రీం కోర్టు కొట్టేసింది. మాపై వేసిన ఈ కమిషన్ కూడా రాజకీయ ప్రేరేపితం, కుట్ర. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కూడా కోర్టులో నిలబడదు. ఇది ఓ డొల్ల రిపోర్టు. హక్కులకు భంగం కలిగినప్పుడు ఎవరైనా కోర్టుకు వెళ్తారు. నివేదికను రద్దు చేయాలనే కోర్టుకు వెళ్లాం. అసెంబ్లీలో చర్చించవద్దని కోరలేదు.' అని హరీశ్‌రావు తెలిపారు.

## బీసీల రిజర్వేషన్లకు
# లైన్‌క్లియర్

### మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులకు ఆమోదం

బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి సీతక్క

గత ప్రభుత్వచట్టమే గుదిబండ సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

నేడు బిల్లు ఆమోదించాలని గవర్నర్ ను కలవనున్న అఖిలపక్షం

42శాతం బీసీ రిజర్వేషన్లకు వెళ్తాం మంత్రి పొన్నం

(మొదటిపేజీ తరువాయి)



ముందుగా తెలంగాణ పురపాలక చట్టం 2019 నిబంధన సవరణ బిల్లుపై చర్చ జరిగింది. చర్చ జరుగుతున్నందున ఆర్డినెన్స్ కుదరదని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సెషన్స్‌లో ఉన్నప్పుడు బిల్లు రూపంలో తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సీపెక్స్ సర్వే చేపట్టిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ల సిఫారసుకు చర్యలు చేపట్టామన్నారు. సీపెక్స్ సర్వేతో పాటు ఇతర డేటాను అధ్యయనం చేసి, లోతుగా విశ్లేషించి ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు.

### కేసీఆర్ తెచ్చిన చట్టమే గుదిబండ: సీఎం రేవంత్‌రెడ్డి

విద్య, ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం రెండు బిల్లులను గతంలో తాము అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్‌కు పంపినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గవర్నర్ వాటిని ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించారన్నారు. సుమారు 5 నెలల నుంచి ఆ బిల్లులు రాష్ట్రపతి వద్ద ఉన్నాయని చెప్పారు. మున్సిపల్ చట్ట సవరణ బిల్లుపై శాసనసభలో చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. "స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యాయని కొందరు హైకోర్టుకు వెళ్లారు. ఈక్రమంలో సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. రిజర్వేషన్లను కూడా నిర్ధారించాలని తెలిపింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం.. ఉన్న పరిస్థితులు, చట్టాలను పరిశీలించాం. 2018లో కేసీఆర్ పంచాయతీరాజ్ చట్టం తెచ్చారు. అందులో 50 శాతం రిజర్వేషన్ల పరిమితికి లోబడి మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని ఉంది. 2019లో తెచ్చిన మున్సిపల్ చట్టంలోనూ ఇదే ఉంది. ఈ రెండు చట్టాలు గుదిబండగా మారడంతో.. మా ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. వెంటనే ఆ ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపించాం. ఆయన దాన్ని కూడా భారత రాష్ట్ర సమితి నేతల మాటలు నమ్మి రాష్ట్రపతికి పంపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం.

### వాళ్ల పార్టీ నాయకుడు రిజర్వేషన్లకు సిద్ధంగా లేరు

భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లలేదని చెబుతున్నారు. ఐదు సార్లు దీని గురించి ప్రధానికి లేఖ రాశాం. ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. ఈక్రమంలో ప్రధానిపై ఒత్తిడి తీసుకురావడానికి జంతర్‌మంతర్‌లో ధర్నా చేశాం. 100 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు. రాజ్యసభలో ఉన్న భారత రాష్ట్ర సమితి ఎంపీలు మాత్రం అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. బీసీల గురించి మాట్లాడుతున్న గంగుల కమలాకర్ కూడా రాలేదు. వాళ్ల పార్టీ నాయకుడు బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి సిద్ధంగా లేరు. ఈరోజు కూడా సభలో గందరగోళం సృష్టించి బిల్లు ఆమోదం చెందకుండా ప్రయత్నిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటను నేరవేర్చేందుకు కృషి చేస్తోంది. వీలైతే సహకరించండి. లేదంటే మళ్లీ ప్రజలు మీకు సరైన గుణపాఠం చెబుతారు'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్

### కాళేశ్వరం రిపోర్టును డస్ట్ బిన్ లో పడేసిన ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. సభలో మైక్ ఇవ్వనందుకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతుండగా తమకు మైక్ ఇవ్వాలంటూ బీఆర్ఎస్ సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులను మార్షల్స్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ డిప్యూటీ సీఎం భట్టిపై సీరియస్ అయ్యారు. మహిళా మార్షల్స్ తో అదుపుచేస్తున్నారని ఫైర్ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్టు పేపర్స్ ను డస్ట్ బిన్ లో పడేశారు . వేస్ట్ రిపోర్ట్ ..కాంగ్రెస్ రిపోర్ట్ అంటూ పడేశారు. అనంతరం గన్ పార్క్ దగ్గరకు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేపట్టారు. సభలో ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసనకు దిగారు. ప్రభుత్వం ఏకపక్షంగా సభ నిర్వహిస్తోందని మండిపడ్డారు.

## కట్టింది.. కూలింది మీ హయాంలోనే..: మంత్రి ఉత్తమ్ ధ్వజం



డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చేశారని ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో ఉందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ నివేదికపై ఉత్తమ్ కుమార్‌రెడ్డి అసెంబ్లీలో చర్చను ప్రారంభించారు. మేడిగడ్డలో పూర్తి నీరు నిల్వ చేసి కూలిపోయేందుకు కారణం అయ్యారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.87,449 కోట్లు ఖర్చు చేశారని, కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి మేడిగడ్డ దెబ్బతిందని, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం నిరుపయోగంగా మారాయని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. రూ.21 వేల కోట్లతో కట్టినవన్నీ 20 నెలలుగా నిరుపయోగంగా మారాయని ఆరోపించారు. ప్రాణహితచేవెళ్లకు జాతీయ హోదా ఇవ్వాలని గతంలో మూడు లేఖలు రాశారని, అప్పటి కేంద్రమంత్రి ఉమాభారతి రాష్ట్రానికి లేఖ రాశారని గుర్తు చేశారు. ప్రాణహితచేవెళ్లకు తొలుత రూ.11,600 కోట్లు కావాలని కమిటీ చెప్పిందని, ప్రాణహితచేవెళ్ల డిజైన్లను అప్పటి సీఎం మార్చారని కమిటీ చెప్పిందని, మేడిగడ్డలో బ్యారేజ్ నిర్మించవద్దని నిపుణుల కమిటీ స్పష్టంగా చెప్పిందని, మేడిగడ్డ వద్ద బ్యారేజ్ వద్దని వ్యాప్కోస్ నిపుణులు కూడా చెప్పారని వివరించారు. వ్యాప్కోస్ డీపీఆర్ ఇవ్వకముందే మేడిగడ్డ వద్ద బ్యారేజ్ కట్టాలని నిర్ణయించారని, కేబినెట్ అనుమతి లేకుండానే జీవో ఇచ్చారని ఆరోపించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణ ఖర్చులు భారీగా పెంచేశారని, ఆయా బ్యారేజ్‌లకు జరిగిన నష్టం రాష్ట్రానికి పెనుభారంగా మారిందని తెలిపారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు రూ.38 వేల కోట్లతో పూర్తవ్వాల్సి ఉందని, ప్రాణహితచేవెళ్ల ఖర్చును రూ.38 వేల కోట్ల నుంచి రూ.లక్షా 47 వేల కోట్లకు పెంచారని, 2019 నుంచి 2023 వరకు లిఫ్ట్ చేసినవి 162 టీఎంసీలు మాత్రమని అన్నారు. కాళేశ్వరం నుంచి ఏడాదికి 20.2 టీఎంసీలు మాత్రమే లిఫ్ట్ చేశారని, 34 లక్షల ఎకరాలకు ఆయకట్టుకు నీరు ఇస్తామని చెప్పారని పేర్కొన్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని మంత్రి ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చాక ఇలాంటి విపత్తు ఏ రాష్ట్రంలోనూ జరగలేదని, మేడిగడ్డ బ్యారేజ్ కుంగినప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని విమర్శించారు. ఎన్‌డీఎస్‌ఏపై బీఆర్ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. ఎన్‌డీఎస్‌ఏలో నిపుణులు, సీనియర్ అధికారులు ఉంటారని, పూర్ ప్లానింగ్, డిజైన్ వల్లే మేడిగడ్డ కూలిందని ఎన్‌డీఎస్‌ఏ తేల్చి చెప్పిందని తెలిపారు. నిర్మాణంలో క్వాలిటీ కంట్రోల్ పాటించలేదని ఎన్‌డీఎస్‌ఏ నిపుణులు స్పష్టం చేశారని, మే వచ్చాక ఆ మూడు బ్యారేజ్‌ల్లో నీరు నిల్వ చేయలేదని వెల్లడించారు. మీరు కట్టిన ప్రాజెక్టు మీ హయాంలోనే కూలిపోయిందని ఆరోపించారు.

## తప్పు చేసి సిగ్గుపడట్లేదు

కాంట్రాక్టర్లకు మేలు చేసేలా అప్పటి ప్రభుత్వ పెద్దలు వ్యవహరించారని కమిషన్ చెప్పిందని, ఏయే నేతలు, అధికారులు బాధ్యులో కూడా కమిషన్ స్పష్టం చేసిందని మంత్రి తెలిపారు. 660 పేజీల పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సభ ముందుంచామని, ఇంజినీర్లు, ఐఏఎస్‌లు కూడా బాధ్యులని స్పష్టంగా చెప్పిందని, నాటి సీఎం నేరుగా బాధ్యులని కమిషన్ నివేదిక ఇచ్చిందని, నీటిపారుదల, ఆర్థికశాఖ మంత్రులు కూడా బాధ్యులను కమిషన్ చెప్పిందని అన్నారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. సాధారణంగా తప్పు చేసినవారు ఎవరైనా సిగ్గుపడతారని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణను ప్రభుత్వానికి పెనుభారంగా మార్చారని, విద్యుత్‌శాఖకు ఇప్పుడు రూ.9,735 కోట్ల కరెంట్ బిల్లులు కట్టాలని అన్నారు.



## ఇదంతా ట్రాష్

### బీజేఎల్పీ నేత మహేశ్వరరెడ్డి

కాళేశ్వరం రిపోర్ట్ రాజకీయ ఆరోఫణలతో నిండి ఉందని, బీఆర్ఎస్ కాంగ్రెస్ రెండు అవగాహనలో భాగంగానే పనిచేస్తున్నాయని బిజెఎల్పీనేత మహేశ్వరరెడ్డి అన్నారు. రిపోర్ట్ లో మొదటి పేరు జోషి, రెండో పేరు స్మితా సభర్వాల్, మూడో పేరు ఫైనాన్స్ సెక్రటరీ రామక్రిష్ణారావు పేరు ఉందని,. ఆయనకు ఈ ప్రభుత్వం ప్రమోషన్ ఇచ్చి ఎలా సీఎస్ గా నియమిస్తుందని ప్రశ్నించారు. ఇప్పటివరకు అనేక విచారణలు జరిగినా, ఒక్క దాంట్లోనూ కేసులు నమోదుచేయలేదన్నారు.



## కేసీఆర్ ఎందుకు రారు

### కోమటిరెడ్డి ఫైర్

ప్రధాన ప్రతిపక్షనేత కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ప్రజలను అవమానిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫైర్ అయ్యారు. మేడిగడ్డ బ్యారేజ్ కూలడానికి తామే కారణమని సభకు వచ్చి కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని హితవు పలికారు. బీసీ రిజర్వేషన్లపై, కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చ జరుగుతుంటే కేసీఆర్ సభకు ఎందుకు రారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. కమీషన్ల కోసమే కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం కట్టిందని ఆరోపణలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఎక్కడ కట్టాలో.. ఎలా కట్టాలో వారికి తెలీదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం హడావుడిగా కట్టింది కాబట్టే కూలిపోయిందని విమర్శించారు. తెలంగాణ ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని.. ఆమె కాళ్లు మొక్కి కేసీఆర్ వచ్చారని గుర్తుచేశారు. గతంలో అసెంబ్లీలో సోనియా వల్లే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ చెప్పారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.

# విజయం సాధించాం

### బీసీ రిజర్వేషన్లు అమలు చేసే ఘనత మాదే..

ప్రభుత్వ పథకాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఏఐసీసీ జూమ్ మీటింగ్‌లో మహేష్ కుమార్ గౌడ్

(మొదటిపేజీ తరువాయి)



రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ఆశయాల మేరకు ఎవరి జనాభా ప్రకారం వారి వాటా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పని చేసింది.కులగణన చేపట్టం, బీసీ కమిషన్ డెడికేటెడ్ బీసీ మిషన్ వేసి లెక్కలు తేల్చము. అసెంబ్లీ, మండలి లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు చేస్తూ బిల్లు చేశాం. ఆ బిల్లులు గవర్నర్ రాష్ట్రపతికి పంపి ఆలస్యం అవుతుంటే కోర్ట్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ చేయమంటే ఆర్డినెన్స్ తెచ్చాము..

ఆర్డినెన్స్ కూడా గవర్నర్ ఆమోదించకపోవడంతో ఈ రోజు అసెంబ్లీలో మళ్ళీ రిజర్వేషన్లు పరిమితి ఎత్తివేస్తూ 42 శాతం బీసీ రిజర్వేషన్లను చేసి బిల్లు పాస్ చేసి చూపించాం. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి వర్గం పూర్తి చిత్తశుద్ధితో పని చేసింది. ఎన్ని రాజకీయ, సాంకేతిక, న్యాయ పరమైన అడ్డంకులు వచ్చినా ఎదుర్కొని నేడు బీసీల రిజర్వేషన్లు విషయంలో అన్ని చేసి చూపించాం. మన చిత్తశుద్ధి, పనితనాన్ని కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో మండలాల్లో, జిల్లాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. బీసీ రిజర్వేషన్లు హీరో గా కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ, ఖర్గే, రేవంత్ రెడ్డిలను నిలబెట్టాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం పూర్తి స్థాయిలో విజయం సాధించాలి. 20 నెలల కాంగ్రెస్ పాలనలో చేసిన ప్రజా పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, బీసీ రిజర్వేషన్లు పెద్ద ఎత్తున కింది స్థాయి వరకు తీసుకోవాలి' అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.



## మీ చరిత్ర అంతా బయటికి తీస్తాం

### హరీష్ పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫైర్

**మహా:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పై అసెంబ్లీలో వాడీ వేడీ చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల తూటాలు పేలాయి. తుమ్మడిహట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టును మేడిగడ్డకు ఎందుకు తరలించాల్సి వచ్చిందని మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. తుమ్మడిహట్టిని పక్కనబెట్టి మేడిగడ్డ వద్ద ప్రాజెక్టును నిర్మించారు..కమిషన్ల కోసమే గత బీఆర్ ఎస్ ప్రభుత్వం చేసిందని పొంగులేటి అన్నారు. రూ.6వేల 100 కోట్లు ఖర్చు పెట్టాకకూడా ఎందుకు పక్కన పెట్టారు.. రీడిజైన్ పేరుతో మేడిగడ్డకు ఎందుకు మార్చారు..అంత హడావుడిగా ప్రాజెక్టు కట్టాల్సిన అవసరం ఏం వచ్చిందని పొంగులేటి అన్నారు.నిపుణుల కమిటీ సూచనలు పక్కన బెట్టి మేడిగడ్డ ప్రాజెక్టు కట్టారని..మీకు కావాల్సింది రాదనే కదా మేడిగట్టకు మార్చారన్నారు. లక్ష కోట్లు దోచే ఉద్దేశంతోనే కాళేశ్వరం కట్టారని హరీశ్‌రావుపై పొంగులేటి ఫైర్ అయ్యారు. ఒకే టెక్నాలజీతో మూడు ప్రాజెక్టులు కట్టారని..ఇపుడు మూడు బ్యారేజ్ లు ప్రమాదంలో ఉన్నాయని మంత్రి అన్నారు. సీకెండ్ ఫైల్ టెక్నాలజీ వాడటమే ప్రాజెక్టుకు ముప్పు ఏర్పడిందన్నారు. మామ చెప్పగానే అల్లుడు ఇంప్లిమెంట్ చేశారని తెలిపారు. కాంక్రీట్ దయాఫ్రమ్ వాల్ కట్టనందుకే ప్రమాదంలో ఉన్నాయని పొంగులేటి చెప్పారు.

# సెప్టెంబర్ 10న నోటిఫికేషన్?

- 24, 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే అవకాశం
- దసరా లోగా ముగించే యోచన
- ఎన్నికల కమిషన్ కు తేదీలు పంపనున్న సర్కార్
- బీసీలకు 42శాతంపై ధీమా.. 31 జడ్పీలు, 566 మండలాలకు ఎన్నికలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. సెప్టెంబర్ 10 తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతుండగా, సెప్టెంబర్ 10నే షెడ్యూల్ వచ్చే అవకాశముందని తెలుస్తోంది. సెప్టెంబర్ 10న షెడ్యూల్ వస్తే సెప్టెంబర్ 24న తొలి విడత, సెప్టెంబర్ 27 లేదా 28న రెండో విడత పోలింగ్ జరిగే అవకాశాలున్నాయి. దసరాకు ముందే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది. మొదటగా మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాల , జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు నిర్వహిస్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం మీడియాతో వెల్లడించారు. ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇక రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు మొదలుపెట్టింది. సెప్టెంబర్ 10వ తేదీ నాటికి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓటర్ల, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రచురించాలని ఆదేశిస్తూ కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ 6న ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల వారీగా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలు ప్రచురించనున్నారు. సెప్టెంబర్ 68 మధ్య ఈ ముసాయిదా జాబితాలపై ప్రజల నుంచి అభ్యంతరాలు, వినతులు స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 8న జిల్లా స్థాయిలో కలెక్టర్లు, మండల స్థాయిలో ఎంపిడివోలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. సెప్టెంబర్ 9న అభ్యంతరాలు, వినతులు పరిష్కరిస్తారు. సెప్టెంబర్ 10న ఓటర్ల, పోలింగ్ కేంద్రాల తుది జాబితాలు ముద్రిస్తారు. అదే రోజు స్థానిక ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్, నోటిఫికేషన్ వెల్లడించే అవకాశముంది. గతంలో మూడు విడతల్లో ఎన్నికల్లో జరగ్గా, ఈ సారి కూడా అదే పద్ధతిలో జరిగే అవకాశముంది. సభలో మున్సిపల్ చట్టసవరణ బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే అవకాశం ఉంది. గవర్నర్ ఆమోదం తెలిపితే 42శాతంతో ఎన్నికలు జరగనున్నాయి. ఏదైనా ఇబ్బంది తలెత్తితే పార్టీపరంగా ఇచ్చయినా ఎన్నికలకు వెళ్ళాలని సర్కారు వ్యూహంగా కనబడుతోంది.

**రెండువారాలే**

నోటిఫికేషన్ కు పోలింగ్ కు మధ్య రెండువారాలే గడువు ఉండనుండగా, సెప్టెంబర్ 10న నోటిఫికేషన్ వస్తే సెప్టెంబర్ 24 లేదా 25న తొలివిడత పోలింగ్ ఉండనుంది. సెప్టెంబర్ 30లోగా.. రెండు లేదా మూడు విడతల పోలింగ్ నిర్వహించే అవకాశం కనబడుతోంది. పరిషత్ ఎన్నికలు జరిగితే దీపావళి లోగా గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగించే అవకాశాలున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. గడువు ముగిసినా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదంటూ పలువురు తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. మొత్తం 566 జడ్పీటీసీ, మండల ప్రజా పరిషత్ స్థానాలు, అలాగే 5,773 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 31 జడ్పీలకు ఎన్నిక జరగనుంది.

# కేసీ వేణుగోపాల్ అండతో తెలంగాణ అభివృద్ధిపై ఫోకస్

## యువత రాజకీయాల్లోకి రావాలి

### బీజేపీ యువత హక్కులను కొల్లగొడుతోంది

### బీజేపీ సర్కార్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైర్

### ఎంపీ మెరిట్ అవార్డు కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

'ఎంపీ మెరిట్ అవార్డ్ 2025' కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీ వేణుగోపాల్ ఎల్లప్పుడూ పేదల పట్ల, అణగారిన వర్గాల కోసం పోరాడుతూనే ఉన్నారని, అణిచివేతకు, అన్యాయానికి గురవుతున్న బాధితుల తరపున వారు గొంతుకగా నిలుస్తున్నారన్నారు. కేసీ వేణుగోపాల్ అండతో తెలంగాణ అభివృద్ధిపై ఫోకస్ పెట్టామన్నారు. కేసీ వేణుగోపాల్ తన నియోజకవర్గంతో పాటు కేరళ రాష్ట్రానికే కాకుండా యావత్ దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, ప్రత్యేకించి మహిళలు, పిల్లల న్యాయం కోసం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్నారని కొనియాడారు. ఆయన 2006 లో ప్రారంభించిన పొంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డులకు దేశంలోనే చాలా ప్రత్యేకత ఉందన్నారు. 10 వ తరగతి, 12 వ తరగతి విద్యార్థినీ విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి, వారిలో ఒక స్ఫూర్తిని నింపడానికి ఈ మెరిట్ అవార్డులు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. ఈ ఏడాది వంద శాతం ఫలితాలను సాధించిన 150 పాఠశాలల్లో దాదాపు 3,500 లకుపైగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవార్డులు అందిస్తున్నారన్నారు. దేశంలో విద్యకు, కేరళ రాష్ట్రానికి బలమైన సంబంధం ఉందని తెలిపారు. కేరళ రాష్ట్రంలో విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. 10 వ, 12 వ తరగతి తర్వాత సున్నా శాతం డ్రాప్ అవుట్స్ సాధించడమంటే అందులో ఆశ్చర్యమేమీ ఉండదన్నారు.




'విద్య అనేది మనకు లభించిన ఒక గొప్ప బహుమతి. విద్య అన్నది ఒక గొప్ప ఆయుధం. అదే అందరికీ గొప్ప శక్తి.. అని నేను చాలా బలంగా విశ్వసిస్తా. అలాంటి విద్యకు ప్రాధాన్యతనిస్తున్న దైవ భూమి కేరళ రాష్ట్రం. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్ద ఎత్తున దృష్టి సారించాం. విద్యకున్న ప్రాధాన్యత గురించి నేను ప్రతి సందర్భంలోనూ ప్రజలకు చెబుతున్నా. ప్రభుత్వం చేసే సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు ఏది చేసినా విద్య మనకు అత్యంత ప్రాధాన్యత కలిగింది. వచ్చే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగాపెట్టుకున్నాం. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిదేందుకు కృషి చేస్తున్నాం. తెలంగాణలో పేదలకు నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించాం. కేవలం 55 రోజుల్లో 11055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశాం. వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నాం. ఒక్కో స్కూల్‌కు రూ.200 కోట్లు ఖర్చుతో 25 ఎకరాల్లో నిర్మించబోతున్నాం.

కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించాం. యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. ఆనంద్ మహీంద్రాను చైర్మన్‌గా నియమించాం. ఐటీఐ లను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేశాం. ఒలంపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేసుకుంటున్నాం. విద్యార్థుల్లో ఒక స్ఫూర్తిని నింపడానికి ఇలాంటి మంచి కార్యక్రమం చేపట్టిన కేసీ వేణుగోపాల్‌కు అభినందనలు. వేణుగోపాల్ తీసుకున్న ఈ చొరవను ప్రతి నియోజకవర్గంలో, రాష్ట్రం మొత్తం ఈ విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరుకుంటున్నా. విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అగ్రస్థానంలో విజేతగా నిలుస్తున్న కేరళ రాష్ట్రం పట్ల ఒకింత అసూయ కలుగుతోంది. గత లోక్ సభ ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీ ని, ప్రియాంకా గాంధీ ని తెలంగాణ నుంచి పోటీ చేయాలని కోరాను. కానీ వారు కేరళను తమ ఇంటిగా, తమ నియోజకవర్గంగా, తమ కర్మభూమిగా ఎంచుకున్నారు. ఈ రోజు దేశంలో నెలకొన్న పరిస్థితులను గమనిస్తున్నాం. ఓట్ చోరీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పెద్ద ఉద్యమం చేస్తున్నాం. ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరం కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరముంది' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామెంట్స్ చేశారు.

# గంగుల వర్సెస్ పొన్నం

- మాజీ మంత్రి, మంత్రి మధ్య అసెంబ్లీలో వార్
- బీసీలపై పొన్నంకు అవగాహన లేదన్న గంగుల కమలాకర్
- ఆ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు అభ్యంతరం
- ఆకారంలో పెద్దగా ఉంటే అవగాహన ఎక్కువ ఉంటదనుకుంటే పొరపాటే అంటూ పొన్నం కౌంటర్
- నేను కూడా బాడీ షేమింగ్ గురించి మాట్లాడితే పెద్ద కాంట్రావర్సి అవుతదన్న కమలాకర్

**హైదరాబాద్, మహా:** అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు మధ్య మాటల యుద్ధం నడిచింది. బీసీలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అవగాహన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం పురపాలక, పంచాయితీరాజ్ చట్ట సవరణ బిల్లును తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ బిల్లుపై బీఆర్ఎస్ తరపున మాజీ మంత్రి గంగుల కమలాకర్ చర్చలో పాల్గొన్నారు. ఈ సమయంలో బీసీల రిజర్వేషన్లకు తమ పార్టీ మద్దతిస్తుందని గంగుల కమలాకర్ అన్నారు. అదే సమయంలో బీసీలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అవగాహన లేదని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను గంగుల కమలాకర్ వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. అదే సమయంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకున్నారు. బీసీలకు అనుమానం కలిగేలా తప్పుడు సమాచారం వ్యాప్తి చేయవద్దని సీఎం కోరారు. రాష్ట్రంలో తిరిగి మొత్తం వివరాలు సేకరించేందుకు బీసీ కమిషన్‌కు ప్రభుత్వం ఇచ్చిందని ఆయన అన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, బీసీ బిల్లుపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. వాళ్ల పార్టీ ఆదేశాలకు అనుగుణంగా గంగుల కమలాకర్ ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని ఆయన అన్నారు.

**అలా అనుకుంటే పొరపాటు: పొన్నం ప్రభాకర్**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ బాడీ షేమింగ్ చేశారు. ఆకారంలో పెద్దగా ఉంటే అవగాహన ఎక్కువగా ఉందనుకుంటే నాకు తెల్వదు అని పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే గంగులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లపై అవగాహన తనకు లేదంటే.. గంగుల కంటే ఎక్కువ చదువుకున్నా.. రాజకీయాల్లో విద్యార్థి దశ నుంచి ఉన్నా.. నాకు ఎక్కువ తెల్వదు అనుకుంటే పొరపాటు.. నేను ఏమంటున్న అంటే ఆకారంలో పెద్దగా ఉంటే అవగాహన ఎక్కువ ఉంటది అనుకుంటే పొరపాటు అని పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.

**పెద్ద కాంట్రావర్సి అవుతది: గంగుల కమలాకర్**

పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పందించారు. నేను కూడా బాడీ షేమింగ్ గురించి మాట్లాడితే పెద్ద కాంట్రావర్సి అవుతది అని పేర్కొన్నారు. తాను కేవలం ఒక్కటే అడుగుతున్నా.. శాస్త్రీయంగా బీసీ రిజర్వేషన్లు కల్పించండి.. రాజ్యాంగపరంగా 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నాం. అసెంబ్లీలో బిల్లు పెట్టి జీవో పాస్ చేయడానికి 20 నెలలు ఎందుకు టైమ్ వేస్ట్ చేశారు.. ఈ పని అప్పుడే చేసి, ఎన్నికలకు వెళ్ళాల్సింది అని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మార్చి 2024లో జీవో నెంబర్ 26ను బీసీ కమిషన్ ద్వారా తీసుకొచ్చారు.. ఆ తర్వాత బీసీ కమిషన్ మాయమైంది అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు.

# కల్వకుంట్ల కాదు, కలవకుండా చేసే ఫ్యామిలీ

## అసెంబ్లీలో రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇంటి పేరు కల్వకుంట్ల కాదు.. కల్వకుండా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఎద్దేవా చేశారు. కేసీఆర్ రాష్ట్రంలో ఎవరినీ కలవకుండా చేస్తున్నారని ఆరోపించారు. బీసీలు ఓసీలు కల్వకూడదు.. ఎస్సీ, ఎస్టీలు కల్వకూడదు.. హిందువులు, మైనార్టీలు కల్వకూడదు.. అనే సిద్ధాంతాలను కేసీఆర్ పాటిస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు.

# పంచాయతీ నిధులపై ఢీ

## పంచాయతీరాజ్, మున్సిపల్ సవరణల బిల్లు చర్చ

- వేముల ప్రశాంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్ పరస్పర విమర్శలు
- రాష్ట్రంలో ఇప్పుడు ట్రాక్టర్లలో డీజిల్ పోసే పరిస్థితి లేదని మాజీ మంత్రి కామెంట్స్
- ఈ 20 నెలల కాలంలో బిల్లుల రాకనే సర్పంచ్‌లు ఇబ్బంది పడుతున్నారని వ్యాఖ్య
- మీరు నిధులిస్తే సర్పంచ్‌లు బిల్లుల కోసం ఎందుకు ధర్నాలు చేస్తున్నారంటూ పొన్నం కౌంటర్
- పల్లె ప్రగతి పేరుతో పనులు చేయించి బిల్లులు ఇవ్వకుండా వారిని ఆగం పట్టించారని మంత్రి ఫైర్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ అసెంబ్లీలో పంచాయతీ రాజ్, మున్సిపల్ సవరణల బిల్లు చర్చ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు పరస్పర విమర్శలు సంధించుకున్నారు. వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పల్లె ప్రగతి కార్యక్రమం తీసుకుని కేంద్ర నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు అందించారని.. దీంతో గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. ఫలితంగా 30శాతం కేంద్ర అవార్డులు తెలంగాణ గ్రామ పంచాయతీలకు దక్కాయన్నారు. ఈ 20 నెలల కాలంలో బిల్లుల రాకనే సర్పంచ్ లు ఇబ్బంది పడుతున్నారని.. ట్రాక్టర్లలో డీజిల్ పోసే పరిస్థితి లేదన్నారు. మేం పంచాయతీలకు నిధులు ఇచ్చామో లేదో ప్రభుత్వం పరిశీలించవచ్చన్నారు. అయితే మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ కేసీఆర్ పల్లెప్రగతితో నిధులిస్తే ఇవ్వాళ సర్పంచ్ లుబిల్లుల కోసం ఎందుకు ధర్నాలు చేస్తున్నారంటూ కౌంటర్ వేశారు. పల్లె ప్రగతి పేరుతో నిధులిస్తామని చెప్పి సర్పంచ్‌లకు టార్గెట్ పెట్టి పనులు చేయించి బిల్లులు ఇవ్వకుండా వారిని ఆగం పట్టించారని పొన్నం మండిపడ్డారు.

### రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశంతోనే ఈ బిల్లులు..

శాసనసభ సమావేశాల్లో పురపాలక, పంచాయితీ రాజ్ చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లులను ప్రవేశపెట్టిన సందర్బంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశంతోనే ఈ బిల్లులు తెచ్చామని చెప్పారు. బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు ఈ బిల్లులు కల్పిస్తామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు సభ్యులందరూ సహకరించాలని కోరారు. అనంతరం బిల్లులపై చర్చ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడారు.



మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?

ANN SCHOOL OF JOURNALISM ANN TELUGU ESTD.2025

జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం

ANN SCHOOL OF JOURNALISMలో

జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.



గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఇదే మా ఆహ్వానం

అడ్మిషన్లు ప్రారంభమైనవి

అప్లికేషన్‌కు ఆఖరుతేదీ - సెప్టెంబర్ 4

తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 2వ వారం

పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన

మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు

8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు

కోర్సు పూర్తైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును

మెరిట్ స్టూడెంట్స్ కు ఇంటర్న్‌షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్

HURRY UP! LIMITED TIME త్వరపడండి...

FOR ADMISSIONS CONTACT: +91 74369 39999

SCAN ME

APPLY ON OUR OFFICIAL WEBSITE: WWW.ANNSCHOOLOFJOURNALISM.COM

అడ్మిషన్లు ప్రారంభమైనవి | ఆఖరుతేదీ - సెప్టెంబర్ 4 | తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 2వ వారం



ఉద్యోగావకాశం

పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న

మహా పత్రికకు

(RNI NO: APTEL/2003/09316)

ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

WWW.EPAPER.MAHAADAILY.COM

ఆసక్తి గల వారు సంప్రదించండి

MAHAAPATRIKA@GMAIL.COM,

95501 59679, 90001 41919

## ఒక్క రోజైనా జైలు తాళాలు
# పారేసి పోరు

అత్తర్ పరిమళం వేరు
షరాబ్ నిషా వేరు
కళ్లమీద అల్లుకొన్న,
సాలె గూళ్ల వలలు వేరు
మనిషికి రెక్కలిచ్చే,
కలల బలం వేరు

చాలా యేండ్ల తర్వాత
జీవితం నన్ను అర్థం చేసుకుంది
కానీ, అప్పటికే, అక్కడి వంతెన
కూలిపోయింది
బ్యాండు బాజాతో,
బారాత్ ముందుకు వెళ్లిపోయింది

మరణించిన వీరులు
చాలాసార్లు కలలోకి వస్తున్నారు
అమాయకులను, విడిపించాలనుకుంటే,
ఒక్క రోజైనా గేటు దగ్గర,
జైలు తాళాలు పారేసి పోరు

ఇష్టమైన దాన్ని దానం చేయొచ్చు
కష్టపడి పొందిన దాన్ని పోగొట్టు కోవచ్చు
జ్ఞాపకం పెట్టుకో.....
జీవితాన్ని, ఎలాపడితే, అలా వాడుకోవద్దు

ఈ మనుషులను తెలుసు కోవడానికి
నేను ఎందరికో దూరం కావాల్సివచ్చింది
అందరినీ కలుపు కోవడానికి
నేను చాలా వాటిని పోగొట్టు కోవాల్సి వచ్చింది

వాళ్లు పడవల్లో నా వెంట పడ్డారు
నాకు ఈత రాదని తెలిసీ కూడా
నేను మునిగి పోతుంటే
అందరు నవ్వుకొంటూ
సెల్ఫీలు తీసుకున్నారు

స్నేహం వేరు,ప్రేమ వేరు
ఆ రెండిటినీ వెదుక్కుంటూ
మనుషులు ఆగమై పోయారు

**- ఆశారాజు,**
93923 02245

# గృహ ప్రవేశం

చిన్నప్పుడు మా ఇంట్లో పెరిగి
రెక్కల్లో బొక్కల్లో ఎదిగిన
మా నడిపి మనుమరాలు
ఐదో తరగతి చదువుకుంటుంది

ఇప్పుడు మా దగ్గర కాకుండా
ఉదయం సకాలంలో తయారై
స్కూల్ కు పోవడం
సాయంత్రం హోవర్క్ చేసుకోవడం...

మూడు నాలుగు నెలలుగా
వాళ్ల అమ్మ ఇంట్లోనే ఉంటుంది

ఎవరూ పిల్లలు రాని
సందడి లేని ఇంట్లో
నేనూ వాళ్ళ అమ్మమ్మ
పిల్లి పట్టిన కోడి పిల్లలా
బుగులు దిగులుగా...

శనివారం సాయంత్రం మరీ అడిగి
చుట్టపు చూపుగా వచ్చింది

రావడం రావడంతోనే
గారాబం మాటలతో
పాత ఇంటికి సున్నం జాజూ చేసినట్టయింది

తన చిట్టి చిట్టి చేతలతో
ముద్దు ముద్దు మాటలతో
ఆమె అడుగు పెట్టగానే పెద్ద దర్వాజకు
పచ్చని మామిడాకు తోరణం కట్టి
పెద్ద కడపను పూదిచ్చినట్టయింది

ఇల్లు సరికొత్త కళతో
నిండుగా తొణకిసలాడిపోతున్నది

చాలా రోజుల తర్వాత
మనమరాలు రాకతో
కొత్త ఇంట్లోకి
మేము పోయినట్టయింది

**-జూకంటి జగన్నాథం,** 94410 78095

# ఆమె మార్గం అనితర సాధ్యం
# అనిశెట్టి రజితకు నివాళి

ఏదేని ఓ వ్యక్తి అనేకరకాల సామాజిక కట్టుబాట్లు, నియమనిబంధనల, దేశ కాలమాన పరిస్థితుల నడుమ తాను నమ్మిన, ఏర్పరుచుకున్న సిద్ధాంతానికి, నికార్సైన వ్యక్తిత్వానికి ఆ జన్మాంతం నిక్కచ్చిగా నిలబడి, కట్టుబడి ఉండడం దాదాపుగా అసాధ్యం. పైగా ఈ ప్రపంచీరణపు స్వార్థపూరిత లోకంలో మనుషుల ను మలినం చేయగలిగిన వ్యాపకాలూ అనేకం. ఐనప్పటికీ ఇలాంటి పరిస్థితులను అధిగమించి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన వారిలో అనిశెట్టి రజిత ఒకరు. అట్లాంటి ప్రభావవంత నేపథ్యాలున్న వ్యక్తి ని ఇటీవలకాలంలో కోల్పోవడం ఈ సమాజానికి, సాహిత్యలోకానికి ముఖ్యంగా తెలంగాణ ప్రాంతానికి తీరని లోటు. రజిత పూర్వాపరాలను గమనిస్తే సమాజ ఉన్నతికి, సాహిత్య పరిణతికి తాను చేసిన త్యాగాలు, అకుంఠిత పరిశ్రమ కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో నుంచి అనిశెట్టి రజితను గుర్తుచేసుకుందాం. రజిత వరంగల్లు జిల్లాలో 1958, ఏప్రిల్ 14వ తేదీన హన్మకొండలోని కుమార్పల్లిలో జన్మించింది. తండ్రి అనిశెట్టి బాలరాజు, తల్లి జయలక్ష్మి. వారికి సంతానంగా ఇద్దరూ కుమార్తెలు. రజిత మొదటి కుమార్తెకాగా రెండో కుమార్తె రేణుక. చిన్నతనంలోనే తండ్రి కాలం చేయడంతో అనేక కష్టాలను ఎదుర్కొన్నది. ఆర్థిక కారణాలతో ఫార్మసీ చదువును వదిలి బి.ఏ.లో చేరి బంగారు పతకం తెచ్చుకుంది. ఎం.ఏ.(సోషియాలజీ)లో కూడా యూనివర్సిటీ మొదటి ర్యాంక్ను సాధించి 'గోల్డ్ మెడల్' పొందింది. ఆ తరువాత ఎం.ఫిల్లో చేరింది. కానీ తన ముక్కుసూటి తత్వం మూలంగా పిహెచ్.డిని మధ్యలోనే వదులుకుంది. ఆ తరువాత 1992లో కాకతీయ విశ్వవిద్యాలయంలో బోధనేతర ఉద్యోగినిగా చేరింది. చిన్నతనం నుండే తెలంగాణ ఉద్యమంలో పాటు ఇతర సామాజిక ఉద్యమాలలో పాల్గొనడం వలన వివిధ రకాల వ్యక్తులతో, వ్యవస్థతతో విస్తృత స్థాయి పరిచయాలు ఏర్పడ్డాయి. అదే సందర్భంలో సాహిత్యంలోకి ప్రవేశించింది. రజితలోని పోరాట దృక్పథం, చైతన్య స్ఫూర్తి ఆమెను బలీయమైన సాహిత్య సృజన చేసే విధంగా తయారు చేశాయి. విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు ఒక కవిసమ్మేళనంలో తాను రాసిన 'చైతన్యం పడగెత్తింది'అనే కవితకు బహుమతిని పాఠశాల స్థాయిలోనే గెలుచుకుంది. 'ప్రపంచమంతా పైసామయమే'అనే కవిత వినిపించి సినారే వంటి వారిని మెప్పించింది. తన కున్న కవితాసక్తికి గెలుచుకున్న బహుమానాలు మరింత ఉత్సాహాన్ని అందించాయి. ఆ ఉత్సాహమే సాహిత్యాభిలాషకు, సృజకు నాంది పలికాయి.

పాలిటెక్నిక్, ఫార్మసీ కళాశాలల విద్యార్థుల సమస్యల గురించి జరిగిన ఉద్యమంలో పాల్గొనడం, ధర్నాలు చేస్తూ అభ్యుదయ మార్గంలోకి అడుగుపెట్టింది. నాటి నుండే ప్రజాసమస్యలపై నిస్వార్థంగా పోరాడడం మొదలు పెట్టింది. ఆ మార్గంలోనే తన తుదిశ్వాస వరకు నడిచింది. 'జై తెలంగాణ ఉద్యమం'(196971)జరుగుతున్నప్పుడు కూడా ప్రత్యక్షంగా ధర్నాల్లో, రాస్తారోకోలలో పాల్గొన్నది. చైతన్యసాహితి, స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ, నారీ చైతన్య వేదిక, మహిళా చైతన్య సమాఖ్య, జన



మిత్ర మండలి, రుద్రమ ప్రచురణలు, సావిత్రిబాయి పూలే చారిటబుల్ ట్రస్ట్, ముక్త తెలంగాణ ఉమెన్స్ కలెక్టివ్, తెలంగాణ ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక మొదలగు సంస్థతో కలసి సామాజిక, సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలు, కార్యక్రమాలు నిర్వహించింది. తన కలానికి 'అగ్నిపాళి'అనే పేరు పెట్టుకుని గులాబీలు జ్వలిస్తున్నాయి(కవిత్వం), నేనొకనల్లమబ్బునవుతా (కవిత్వం), చెమటచెట్టు(కవిత్వం), ఓలచ్చువ్వ(దీర్ఘకవిత), ఉసురు(కవిత్వం), గోరంత దీపాలు(నానీలు), దస్తఖత్(హైకూలు), అనగనగా కాలం(కవిత్వం), మట్టిబంధం(కథా సంపుటి), నవ్వే ఓ నవ్వే(నానీలు), మార్కెట్ స్మార్ట్ శ్రీమతి(దీర్ఘకవిత), నిర్భయాకాశం కింద(కవిత్వం), ఆచార్య పాకాల యశోదారెడ్డి(మోనోగ్రాఫ్) మొదలగు రచనలు వెలువరించింది. అంతేకాకుండా సంపాదకరాలుగా కూడా బహుగ్రంథాల ముద్రణకు స్వీకారం చుట్టింది. అందులో వెతలే కథలై (రచయిత్రుల కథా సంకలనం), ఊపిరి(తెలంగాణా ఆత్మహత్యలపై నిరసన కవిత), బి.సి సంకల్పం , తెలంగాణ ఉద్యమ మెరుపులు(ఉద్యమ కవిత), జిగర్(తెలంగాణ విశిష్ట కవిత్వ సంకలనం), ఉద్విగ్న (అత్యాచారాలపై నిరసన కవిత), ఆకాశపుష్పం (అపూర్వ త్యాగానికి నీరాజనం), ముజఫర్నగర్ మారణకాండ అగ్నిశిఖ (అత్యాచారాల వ్యతిరేక సంకలనం), పోలవరం ప్రాణాంతక ప్రమాదం(ముంపు గ్రామాల గోడు ), అక్షర శరథి దాశరథి (రంగాచార్య రచనలపై వ్యాస సంకలనం), తీరొక్కపూవులు (భిన్న అస్థిత్వాల స్త్రీల సాహిత్యం), తెలంగాణ రచయిత్రుల శతాధిక కథా సంకలనం(కథలు), ఆదివాసుల మారమ్మాయి (మహాశ్వేతాదేవి రచనలపై వ్యాస సంకలనం), బోల్షివిక్ విప్లవ స్ఫూర్తి వ్యాసాలు, ఏడాది ప్రయాణం మొదలగు రచనలు కూర్పుచేసింది.

ప్రక్రియ ఏదైనప్పటికి రజిత సృజనాత్మక సాహిత్యంలో శీర్షికల మొదలుకుని ముగింపుల వరకు అన్ని ప్రత్యేకమైనవి. అవి సామాన్య ప్రజా జీవితాలకు ప్రతీకలుగా, ఇక్కడి ప్రజలు ధర్మాగ్రహంతో ధిక్కార స్వరాన్ని వినిపించే గొంతుకలా, అనన్య సామాన్య విషయాలపై ప్రతి స్పందనగా, బలహీన వర్గాల పక్షాన నిలబడిన బలంగా కనిపిస్తుంది. కవిత్వం, కథా, విమర్శలతో తన వాదాన్ని, దృక్పథాన్ని సుస్పష్టంగా వ్యక్తపరిచింది. ప్రత్యక్ష ప్రజాపోరాటాలు, ప్రసంగాలు, స్వీయ రచనలు, సంపాదకీయ సంకలనాలు, వాటి ఆవిష్కరణలు, క్షేత్రపర్యటనలతో అవిరళకృషి చేసింది. మనిషి తన కోసం, భవిష్యత్ తరాలకోసం శక్తి వంచన లేకుండా కష్టపడుతాడు. అందులోనే తన సంతోషాలను వెతుక్కుంటాడు. అటువంటి జీవితమే సరైనదని, పరిపూర్ణమైనదని ఈ సమాజం కూడా నమ్ముతూ, దానినే పాటిస్తూ వస్తుంది. కానీ ఈ విధమైన ఆచరణలో స్వార్థపూరిత ఆలోచన ఉన్నదని భావించిన రజిత తన వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా వదులుకున్నది. ఈ సమాజం కొరకే అంకితమై నూటికి నూరుశాతం ప్రజలతో మమేకమైంది. తనకు వ్యక్తి గత, కుటుంబ జీవితం మంటూ పెద్దగా ఏదీ లేదు. సమాజమే తన కుంటుంబమని భావించింది. అనేక సాధకబాధకాల నడుమ ఎదిగిన ఒక స్త్రీ నేను, నా అనే స్వంత జీవితమనే ఆలోచన లేకుండా ఏ బంధనాల చట్రంలోకి వెళ్ళకుండా నలభై ఏళ్ళకిందనే సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని ఒంటరిగా ఉండిపోయింది. సభలు, సమావేశాలు, సాహిత్య సృజన, సమస్యాత్మక ప్రాంతాలలో క్షేత్ర పర్యటనలుతో దేహం అలసిపోయినా, ఆవేశాలు, అసహనాలు, ఆవేదనలు మానసికంగా కృంగదీసినా సమాజం కొరకే నిబద్ధతగా, నిక్కచ్చిగా నిలబడి 'ఒన్ ఉమెన్ ఆర్మీగా'పేరు సంపాదించుకుంది. ఒక మహిళ తలుచుకుంటే చేయలేని పనులుండవనే మాటకు తార్కాణంగా రజిత జీవనగమనం క్రియాశీలకంగా నిర్మితమైంది. కష్టం విలువ తెలిసిన తాను చివరిరోజుల్లో వరకు కూడా ఎవరిమీద అధారపడకుండా ఒంటరిగానే ఉన్నది. తను కలలుగన్న సమసమాజాన్ని వదిలి ఆగష్టు 11తేదీన(67వయసులో) గుండెపోటుతో కాలంచేసింది. దీనితో యావత్ తెలుగు సమాజం తీవ్ర దిగ్భ్రాంతి చెందింది. మరణాంతరం కూడా తన దేహం ఈ సమాజానికి ఏదో ఒక విధంగా ఉపయోగపడాలని భావించి కాకతీయ మెడికల్ కాలేజీకి తన భౌతికకాయాన్ని అందించేలా చూసుకున్నది. తెరిచిన పుస్తకంగా జీవించిన రజిత ఆశయాలు, ఆచరణలు భవిష్యత్ తరాలకు ఆదర్శనీయాలు. అటువంటి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తులు చాలా అరుదు. అంతటి మహోన్నత త్యాగశీలికి యావత్ తెలుగు ప్రజల తరుపున ఘన నివాలలు, జోహార్లు.

**- డా. వడ్కాపురం క్రిష్ణ**
81254 15477

# మదిలో సజీవంగా నిలిచిపోయే ఊరి జ్ఞాపకాల కథలు
# కథల మండువ

**- రమేశ్ చెప్పాల, రచయిత**

**పుస్తక సమీక్ష**

ఎక్కడో పట్టణంలో నివసిస్తూ అప్పుడప్పుడు ఊరి జ్ఞాపకాలు మదిని తడుతున్నప్పుడు బాల్యంలోకి వెళ్తూ ఊరిలోని అనుభవాలను అనుభూతులను సందర్భం వచ్చినప్పుడు కాని ఏదైనా సంఘటనను చూసినప్పుడు మనసులో వాటంత అవే కళ్ళ ముందు ఆవిష్కృతం అవుతుంటాయి. అప్పుడు నడిసొచ్చిన తోవలన్నింటినీ నెమరేసుకుంటుంటాం. జీవితమనే కాన్వాస్ పై ఊరిలో గడిపిన జీవితం చిత్రపటాలై బతుకుదారికి గొప్ప భరోసాని, బాధ్యతల్ని నింపి పంపిస్తుంది. ఊరిలోని అనుబంధాలను గడిపిన అనుభూతులను మరొక మారు బాల్యపు స్మృతుల్లోకి తీసుకెళ్లే లాగున రాసిన కథలను మన ముందుకు తన తాజా కథల సంకలమైన "కథల మండువ" తో వచ్చారు 'రమేశ్ చెప్పాల'గారు.


'బతకనేర్వని మా బాపు కథ'లో వైకుంఠం పాత్ర నిత్యం మనకు అగుపిస్తుంటుంది. వైకుంఠం ఊరిలో కరెంటు పని, పెండ్లిలో 'పెళ్లి పందిరి' చేస్తూ నిజాయితీగా పనిచేస్తూ అందరి ఆదరాభిమానాలు పొందుతాడు. కొన్ని సందర్భాలలో చేసిన పనికి కూడా పైసలు తీసుకునేవాడు కాదు అది చూసిన తన కొడుకుకి కోపం వస్తుంది. నాలుగు పైసలు సంపాదించుకో మరి అంతా నిజాయితీ ఎందుకు అని అన్నకానీ నవ్వుతూ ఊరుకునే వాడే కానీ అదనంగా ఎవరి దగ్గర పైసలు తీసుకునేవాడు కాదు. ఒకరోజు పని దగ్గర కాలుజారి పడి చెయ్యి విరిగితే అప్పుడు ఊరందరు కలిసి వచ్చి 'హే వైకుంఠం నీకేం కాదు!! మేమంతా లేమా!!' అంటూ ధైర్యం ఇచ్చినప్పుడు తన కొడుకుకి అర్థమవుతుంది 'మా బాపు బతకనేరిసిందని..?!'.చేసేపనిని నిజాయితీగా చేస్తే ప్రజల్లో వచ్చే విలువేంటో ఈ కథలో చక్కగా చెప్పారు రచయిత.

"కెనాల్ కిరికిరి" కథను చూసినట్లయితే రెండు గ్రామాల మధ్య కెనాల్ నీళ్లు పంట పొలాలకు నీళ్లను పారియ్యడానికి కింది గ్రామాల వాళ్లు పై గ్రామాల వాళ్లు నీళ్లు రానీయకుండా కెనాల్ తూముకి అడ్డుపెట్టినప్పుడు ఇరు గ్రామాల వారు గొడవపడి వారి పొలాలకు నీళ్లు తీసుకోవడానికి అక్కడ వారితో కొట్లాడి నీళ్లు తీసుకొచ్చుకుంటారు. ఊరికి వచ్చిన నీళ్లను కులాల వారీగా, పొలాల వారిగా ఉన్నవారిగా లేనివారిగా విడిపోయి మాకు ముందని అంటే మాకు ముందని కొట్లాడేటోళ్లు. ప్రతి ఏడు సంకురాత్రి దీపావళి, దసరా పండుగలు ఎట్లనో ఆ ఊరి చుట్టుపక్కల ఈ కెనాల్ కిరికిరి అట్లనే. కలిసున్నా ఊరే కొట్టుకున్న ఊరే. కొట్టుకున్న తిట్టుకున్న ఆపదవస్తే అందరూ ఒకటవుతారు. ఊళ్ళో ఉన్నవాళ్ళందరూ ఎవరి వంతు వారు సాయం చేసి వాళ్ల ప్రేమ మాత్రం ఎప్పటికీ తగ్గిపోకుండా చూసుకుంటారు. ఊరిలోని అంతరంగిక వ్యవహారాల గూర్చి,ఊరంతా కలిసుంటే వచ్చే ప్రజానాలగూర్చి తెలియజేసే కథ. 'ఐక్యమత్యమే మహాబలం' అనే సూత్రాన్ని ఈ కథలో చక్కగా వివరించారు.

తెలంగాణ ప్రాంతంలో 'జాజిరి' అనేది ఒక సంప్రదాయం. జాజిరిపాటలతో పల్లెటూర్లలో చిన్నారులు, పెద్దలు సందడి చేయడం తరతరాలుగా ఆనవాయితీగా వస్తుంది. ఈ పండుగ హోలీకి ముందు 9 రోజులపాటు ఊళ్ళల్లో పాటలు పాడుతూ మనసుల్ని, మనుషుల్ని కదిలించే విధంగా ఎంతో కోలాహలంగా, ఆనందంగా జరుపుకునే పండుగే "జాజిరి". ఇంటింటికి వెళ్లి పాటలు పాడుతూ కోలాలు ఆడుతుంటే ఇంటివాళ్లు పైసలు, మక్కలు, వడ్లు, ఇట్లా ఏదిస్తే అది తీసుకుని హోలీ రోజున అన్ని అమ్మేసి అందరూ సమానంగా పంచుకునేది. రాను రాను కాలం మారింది టీవీలు, సెల్ ఫోన్లు, కంప్యూటర్లు రాకతోటి సంప్రదాయాలు ఒక్కొక్కటిగా కనుమరుగుతున్నాయి. ఇక్కడ రచయిత తీసుకున్న అంశము బాగున్నప్పటికీ అది సరైన విధంగా కథలాగా మలచలేకపోయాడు. అదేవిధంగా "నా బుజ్జవ్వ" కథ కూడా అలాగే సాగుతుంది. ఎల్లవ్వ సాదుకుంటున్న బర్రె పేరే ముద్దుగా 'బుజ్జి' అని పిలుస్తది. ఊర్లో వాళ్లంతా ఎల్లవ్వని 'పాలమ్మ' అని పిలుస్తుండేవారు. పాలమ్మకి కొడుకు అయినా బిడ్డ అయినా బుజ్జమ్మనే. స్కూల్ కు పోయినా పిల్లల కోసం సాయంత్రం తల్లి దండ్రులు ఎదురుచూసినట్టు పాలమ్మ బుజ్జి కోసం ఎదురుచూస్తుండేది. బుజ్జిని ఎంతో అపురూపంగా చూసుకుంటుంటే ఊరిలోని జనం పాలమ్మ ఇంట్లో బర్రెగా పుట్టిన చాలని అనుకునేటోళ్లు. ఒకరోజు బర్ల మంద నుండి బుజ్జమ్మ తప్పిపోవడంతో పాలమ్మ ఎంతో విలవిలడుతుంది. మూడు రోజుల తర్వాత బుజ్జమ్మ ఇంటికి రావడంతో పాలమ్మ పానం లేచివచ్చినట్టుగా ఉంటుంది. కొద్ది రోజుల తర్వాత బర్రె 'ఈనిన' రోజే ఎల్లమ్మ తిరిగిరాని లోకాలకి వెళ్ళిపోతుంది. ఇంతటితో కథ ముగిసినప్పటికీ కథలో బలమైన కథనం లేక తేలిపోతుంది.

"వాడిక బింకి" కథను చూసినట్లయితే ఒకప్పుడు ఊళ్ళల్లో కల్లు తాగే వాళ్ళు ఇంటింటికి దాదాపుగా అందరూ వాడకం పెట్టుకునేటోళ్లు. ఇక్కడ కళ్ళు అమ్ముకునే పాత్ర రామయ్య. ఎంతో నమ్మకంగా ఎలాంటి కల్తీ లేకుండా కళ్ళు పోసేటోడు. అందువల్ల ఊళ్లో అందరూ రామయ్య దగ్గరే "వాడిక బింకి" తెప్పించుకునే వాళ్ళు. అందరి దగ్గర మంచి పేరు తెచ్చుకున్న రామయ్య కాలక్రమేనా తాగుడికి బానిసై అప్పులు పెరిగిపోయి ఊరు విడిచి పట్టణానికి వెళ్లి వాచ్మెన్ గా చేస్తూ అక్కడే మరణించాడు. అతని శవాన్ని ఊరికి తీసుకొచ్చినప్పుడు అందరూ అతన్ని ఎంతో గుర్తు తెచ్చుకుంటారు. తాగుడుకు బానిస అవుతే ఒక మనిషి జీవితం ఎలా ఉంటుందో చెప్పే కథ.

మరో కథ "జాడలేని మా సమ్మన్న" ఈ కథ వాస్తవానికి చాలా దగ్గరగా ఉండే కథ. ఊరిలో ఏదైనా ఎవరికైనా అన్యాయం జరిగితే పంచాయితీ పెట్టి ఊరు పెద్ద మనుషులు తీర్పు చెప్పేవారు లేదా పోలీస్ స్టేషన్ కి వెళ్లి పోలీసులకు చెప్పేవారు కానీ ఎక్కడైనా సరే డబ్బు పలుకుబడి ఉన్నవారికి న్యాయం దొరుకుతుంది. ఇప్పుడంటే పోలీస్ స్టేషన్ల చుట్టూ లేదా కోర్టుల చుట్టూ న్యాయం కోసం వెళ్తున్నారు కానీ ఒకప్పుడు న్యాయం జరగాలంటే పూరి జనాలు "నక్సలైట్ల" దగ్గరికి వెళ్లేవారు. వీరి దగ్గరికి వెళ్ళితేనే ఎలాంటి అన్యాయం జరగకుండా అందరికీ సరియైన న్యాయం దొరుకుతుంది. నక్సలైట్లను చూస్తేనే అప్పటి కాలంలో దొరలైన, పటేల్ అయినా భయపడుతుండేవారు. కాలక్రమంలో ఇప్పుడు తెలంగాణలో నక్సలైట్ల ప్రభావం దాదాపు కనుమరుగైపోయింది. ఈ కథలోని సమ్మ




న్న పాత్ర వాస్తవానికి దగ్గరగా రచయిత తను చెప్పదలుచుకున్న అంశాన్ని సున్నితంగా చెప్పారు.

ఈ పుస్తకంలో మొత్తము 18 కథలు ఉన్నాయి. ప్రతి కథలో కూడా తెలంగాణ ప్రాంత జీవన విధానాన్ని తెలియజేసే కథలు కనబడతాయి. ఎక్కువ శాతం కరీంనగర్ చుట్టుపక్కల ప్రాంతంలో మాట్లాడే మాండలికభాషలో రచయిత కథలన్నీ చెప్పుకొచ్చారు. కొన్ని కథలు చదువుతున్నప్పుడు మనలోని పురాతన జ్ఞాపకాలను వెలికి తీసి మన మనసు ముందు కదలాడుతున్నట్టు ఉంటాయి. కొన్ని కథలు చదువుతున్నప్పుడు వర్తమానపు ప్రాపంచిక విషయాలకు దూరంగా తీసుకెళ్లి ఎక్కడో అడుగండి పోయిన కొన్ని జ్ఞాపకాల ముందు ఉంచుతాయి. చిన్ననాటి బాల్యపు జ్ఞాపకాలు శాశ్వతమైన సంపద లాంటివి. నోస్టాలజీకి ఉన్న శక్తి అలాంటిది. కథలన్నీ మనల్ని ఊరికి తీసుకెళ్తాయి చిన్నతనంలో జరిగిన సంఘటనలన్నీ మరోమారు మన కళ్ళ ఎదుట ఆవిష్కృతం అవుతాయి. అందుకే రచయిత అంటాడు 'మీ జ్ఞాపకాల్లో మీ ఊరు సజీవ చిత్రంగా ఉండాలని నా ఆకాంక్ష' అంటూ ముగించాడు. ఈ విషయంలో రచయిత విజయం సాధించాడనే చెప్పొచ్చు. చక్కటి కథల పుస్తకాన్ని అందించిన 'రమేశ్ చెప్పాల' కు అభినందనలు తెలియజేస్తూ మరెన్నో సాహిత్య సంకలనాలు మునుముందు తీసుకురావాలని అభిలాషిస్తున్నాను. పుస్తకంలో మొత్తం 134 పేజీలు మరియు వెల 210. పుస్తకం కావలసినవారు అన్ని ప్రముఖ బుక్ స్టోర్స్ లలో లభించును లేదా 9849073163 నంబర్ను సంప్రదించగలరు.

- పుస్తక సమీక్షకులు:
**గాజోజి శ్రీనివాస్.**
99484 83560

# మూలకారకులు

మీరేమో స్టీమ్ ఇంజన్ ను కనుగొన్నది
స్టీవెన్ సన్ అంటారు
నేనైతే ఆవిరియంత్రాల్ని ఆవిష్కరించింది
సన్ ఇన్ స్కై(ఆకాశంలోని సూర్యుడు)
అనే అంటాను
సూరీడు కాలుతున్న వేసవిలో కూడా
కనీసం చెప్పులు వేసుకోకుండా
కాలికి బట్టకట్టకుండా తిరిగి తిరిగి
ఎట్టకేలకు వాగులూ వంకల్లో
చెరువులూ సంద్రాల్లో
బాష్పోత్పాదక కేంద్రాల్ని స్థాపిస్తాడు
అప్పుడు ఆవిర్లన్నీ ఆకాశానికి చేరుతాయి
నిజం
మబ్బులు సహజసిద్ధమైన ఆవిరియంత్రాలు.
శాస్త్రవేత్తల యంత్రాలకు పట్టాలవసరం
ఆపేందుకు పగ్గాలు కావాలి
సూర్యుని యంత్రాలకు
పట్టాల ఆవశ్యకతా లేదు
పగ్గాల అగత్యం అంతకన్నా రాదు
అందుకే అవి పట్టపగ్గాల్లేకుండా
తిరిగి చివరికి అందంగా స్వచ్ఛందంగా
ఆర్ద్రంగా కిందికి దిగొస్తాయి
మరలా సూరీడే మొక్కల్లోనూ చెట్లలోనూ
పండ్లకూ ధాన్యానికీ కారకుడవుతాడు
అయితే మధ్యలో మాత్రం
తన ప్రతినిధిగా
పంటలు పండించడానికి రైతుని నియమిస్తాడు
కాలే కడుపుకు అన్నదాతే ఆసరా
కానీ అతని ఖాళీ కడుపుకు సానుభూతిగా
ఇది ఈ కవిత్వదాత అందిస్తున్న సిరా.

**...నలిమెల భాస్కర్,** 97043 74081

# జంతు దర్పణం

గోడమీద నిశ్శబ్దంగా కదిలే బల్లి.. నా మనసు పై నడిచిన జ్ఞాపకం
దాని మౌనం నా బాధలా.. దాని చలనం నా చింతలా

చీకట్లో దాని కళ్ళు లోన బిగుసుకున్న నిజాల్లా
నన్ను చూస్తుంటే నేను నేననే అనిపించదు

అణువంతదే అయినా నిశ్చయమయిన అడుగు చీమదీ
దారి మూసినా కొత్త దారులు వెదుకుంటుంది
దాని సహనం నన్ను మించి నిలిచింది

దాన్ని తొక్కకుండా మెల్లగా పక్కకు తగ్గాను
అది మాత్రం తన పట్టుదలతో నన్ను నిశ్శబ్దంగా దూషించింది

కళ్ళు మూసుకొని పాలు తాగే పిల్లి
నిజాన్ని తెలిసినా తెలియనట్టు ఉండే మనిషి ప్రతిరూపం
తన దారిలో నడుస్తూ మైమరపు ఆరాధనలో విగత జీవిలా
నా లోన కొత్త అలవాటును పెంచింది

దారిలో ఎదురైన కుక్కను చూసి నా అడుగులు ఆగిపోయాయి
అది నన్నేమీ చేయలేదు కానీ నా లోనుంచి ఆలోచనలు పరుగెత్తుతాయి
ఎవరూ అరవనక్కరలేని చోట కొంతమంది హుషారే గుర్తొచ్చింది

పాము దూరంగా కనిపించినా మనిషి ఊపిరే ఆగిపోతుంది
అది మనల్ని కాటు వేయదు,
కానీ మనలోని అపరాధ భావనల్ని
గుర్తు చేస్తూనే ఉంటుంది
మనిషిని మనిషి మింగేసే విషం
ప్రతి మనిషిలోనూ ఉంది

జంతువుల నడకలో మనిషి ప్రతిబింబం
మనిషి నడకలో జంతు సహజత్వం భేదమేదీ లేదు
చిన్న ప్రాణుల చూపే పాఠమే
మానవత్వానికి పెద్ద దారవుతుంది

**- డా. ఐ. చిదానందం,** 88014 44335

## రచనలకు ఆహ్వానం
సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...
తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.



## భారీ వినాయకుడికి కంది శ్రీనివాస రెడ్డి దంపతుల పూజలు

**ఆదిలాబాద్ మహా :** గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని కుమార్ జనతా గణేష్ మండలి వద్ద భారీ వినాయక విగ్రహానికి ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు..పూజ అనంతరం గణనాయకునికి హారతి తో పాటు నైవేద్యాలు సమర్పించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని వినాయకుడిని ప్రార్థించారు..

# వరద బాధితులు అధైర్యపడొద్దు

## జైనథ్, బేల మండలాల్లో కంది శ్రీనివాసరెడ్డి పర్యటన

- నష్టపోయిన పంటపొలాలు, దెబ్బతిన్న రోడ్ల పరిశీలన
- కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా

**ఆదిలాబాద్, మహా :** పంట ,ఇండ్లు నష్టపోయిన బాదితులు ఎవరూ ఆందోళన చెందవద్దని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం జైనథ్, బేల మండలాల్లో ఆయన పర్యటించారు. జైనథ్ మండలంలోని పెండల్ వాడ, ఆనంద్ పూర్,సాంగ్వి,కరంజి గ్రామాలలోని వరద ప్రభావిత ప్రాంతాలలో తిరిగి రైతులను ప్రజలను ఓదార్చారు. ఇటీవల భారీ వర్షాల ధాటికి దెబ్బ తిన్న పంట పొలాలు రోడ్లు, బ్రిడ్జి లను పరిశీలించారు. బాధిత రైతులను ప్రభుత్వం తప్పకుండ ఆదుకుంటుందని భరోసా కల్పించారు. ఈకార్యక్రమంలో గిమ్మ సంతోష్,భూమారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రుకేష్ రెడ్డి, జగదీష్ రెడ్డి, రాకేష్, అశోక్ ,విట్టల్ రెడ్డి , కాప్రిరాంరెడ్డి కొండా గంగాధర్ ,MA షకీల్ , బెల్లూరి రాంరెడ్డి ,పోత రెడ్డి,వసంత్, తింగం నరేష్, అనిల్ రెడ్డి,మహ్మద్ షరీఫ్,పోచన్న సంజీవ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు. బేల మండలంలోనూ పర్యటించారు. మండలంలోని బెదోడ, కంగార్ పూర్ ,



మనియార్ పూర్ ,ఖోగ్దూర్, మాంగ్రూడ్ గ్రామాల లోని వరద ప్రభావిత ప్రాంతాలలో తిరిగి రైతులను ప్రజలను ఓదార్చారు. ఇటీవల భారీ వర్షాల ధాటికి దెబ్బ తిన్న పంటపొలాలు రోడ్లు, బ్రిడ్జి లను పరిశీలించారు. బాధిత రైతులను ప్రభుత్వం తప్పకుండ ఆదుకుంటుందని భరోసా కల్పించారు.



# భూ వివాదం ఒక వ్యక్తి ప్రాణం తీసింది..?

### దండుమైలారంలో దారుణ హత్య చోటు చేసుకుంది
### ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు
### గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనాయి
### మరో మహిళ పరిస్థితి విషయం

**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం దారుణంగా హత్య చేసిన ఘటన చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం మండలం, దండుమైలారం గ్రామంలోని ఇరు వర్గాల మధ్య 11 గుంటల భూమి, ఒక వ్యక్తి ప్రాణం తీసింది. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. గొడ్డలి గాయాలతో పలువురు హాస్పిటల్ పాలయ్యారు. దీనితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. జరిగిన గొడవ కారణంగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. గ్రామంలో ఉధృత పరిస్థితులు నెలకొనడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏసిపి కెపివి రాజు, పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, నిందితులకు సహకరించిన వారిపై హత్య కేసు నమోదు చేయాలని మృతుడి బంధువులు పోలీసులను డిమాండ్ చేశారు.

**స్థానికులు తెలిపిన కథనం మేరకు వివరాల్లోకి వెళితే...**

దండుమైలారం గ్రామానికి చెందిన గుడేటి జంగయ్య అనే వ్యక్తికి మూడు సర్వే నెంబర్లలో 18 ఎకరాల 12 గుంటల భూమి ఉన్నది. ఆయనకు నలుగురు కొడుకులున్నారు. ఒక్కో భాగానికి నాలుగు ఎకరాల పైచిలుకు భూమి రావాల్సి ఉండగా, అందులో కొడుకులకు 11 గంటల భూమి తక్కువ వచ్చిందని, మరో ఇద్దరు కొడుకులకు అదనంగా 11 గుంటల భూమి వచ్చింది. ఈ విషయమై గత రెండు, మూడు సంవత్సరాలుగా వీరి మధ్య గొడవలు జరుగుతూ వస్తున్నాయి. ఇటీవల ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేసుకున్నారు. కాగా తగాదాలో ఉన్న భూమిలోకి వెళ్లి వ్యవసాయం చేస్తున్న ఇద్దరి కుటుంబ సభ్యులపై, మరో వర్గానికి చెందిన వ్యక్తులు గొడ్డలి వంటి మారునాయుధాలతో గొడవకు దిగి ఒక్క వ్యక్తిని విచక్షణ రహితంగా దారుణంగా హత్య చేశారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన చికిత్స కోసం నగరంలోని ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మరి కొంతమందికి ఇబ్రహీంపట్నం హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నారు తెలిపారు.

**విచక్షణ రహితంగా మారనాయుధాలతో దాడులు....**

గొడ్డలితో చేసిన దాడిలో గుడేటి బాలరాజు అక్కడికక్కడే తీవ్ర గాయాలతో పడిపోయాడు. అడ్డుపోయిన వెంకటరాజు, మహిళపై సైతం మారణాయుధాలతో దాడులకు పూనుకున్నారు. దాంతో వారు తీవ్ర గాయాలయల పాలయ్యారు. రక్తపు మడుగుల్లో పడిపోయిన బాలరాజు అనే వ్యక్తిని ఇబ్రహీంపట్నం ప్రైవేట్ హాస్పిటల్కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గాయాల పాలైన వారు సైతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మంజుల పరిస్థితి మిషమంగా ఉండడంతో ఇబ్రహీంపట్నం ప్రైవేటు ఆసుపత్రి నుంచి నగరంలోని మరో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మంజుల పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో పైన పేర్కొన్న నరసింహ, మల్లయ్య వారసులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుని సోదరులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. ఇదిలా ఉంటే మల్లయ్య, జంగయ్య వారసులు సైతం తమపై దాడులు చేసినట్లు ఈ దాడిలో గాయపడిన శ్రీశైలం, బాలరాజు, లింగస్వామి, యాదయ్య, పారిజాతలకు సైతం తీవ్ర గాలైనట్లు తెలుస్తోంది. వారు కూడా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు.



## హెచ్ఎంఎస్ గౌరవాధ్యక్షురాలిగా కవిత

### బీఆర్ఎస్ బొగ్గుసంఘానికి షాక్

**మంచిర్యాల, మహా:** హెచ్ఎంఎస్ అనుబంధది సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలిగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ లో నిర్వహించిన హెచ్ఎంఎస్ జనరల్ బాడీ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ కవితను సింగరేణి యూనియన్ గౌరవ అధ్యక్షురాలుగా ఎన్నుకుంటున్నట్టు ప్రతిపాదించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. కవితను ఇటీవల బీఆరెస్ అనుబంధ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షురాలిగా తొలగించి ఆమె స్థానంలో కొప్పుల ఈశ్వర్ను నియమించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రెండవ బీఆరెస్ నేతగా కవిత గుర్తింపు పొందారు. గతంలో ఈ బాధ్యతలను నాయిని నర్సింహా రెడ్డి కూడా నిర్వహించారు.ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. పాత వీఆర్ఎస్ స్కీమ్ పునరుద్ధరించాలని కోరారు. వేలంపాట లేకుండా తెలంగాణ బొగ్గు బ్లాకులను సింగరేణి కేటాయించాలని, సింగరేణి కార్మికులకు పెర్క్స్ రీయింబర్స్మెంట్ కింద ఐటీ రిటర్న్స్ ఇప్పించాలని, సింగరేణిలో అలియాస్ మారుపేరుల సమస్యతో బాధపడుతున్న కార్మికులను వన్ టైం సెటిల్మెంట్ కింద క్రమబద్ధీకరించాలని కోరారు. అనారోగ్య సమస్యలతో అండర్ గ్రౌండ్ పనులకు అన్ఫిట్ అయి సర్ఫేస్ ఫిట్ తీసుకున్న సింగరేణి కార్మికునికి బేసిక్ ప్రొటెక్షన్, సూటబుల్ జాబ్ ఇప్పించాలని, కార్మికులకి సొంత ఇంటి పథకం అమలు చేయాలని, సింగరేణిలో పెండింగ్ విజిలెన్స్ కేసులను క్రమబద్ధీకరించాలని తీర్మానం చేశారు. జైపూర్ పవర్ ప్లాంట్ లో పనిచేస్తున్న భూనిర్వాసితులను రెగ్యులరైజ్ చేయాలని, సింగరేణి కార్మికులకు కంపెనీ లాభాల వాటా 35 శాతం ఇప్పించాలని, సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు వర్కర్స్ కి కంపెనీ లాభాల్లో 10 శాతం వాటా ఇప్పించాలని కోరారు.

### చేవెళ్ల రైతు బజార్లో కనీస వసతులేవ్..?

# బతుకుదెరువెట్లా..?

- ట్రాఫిక్ పేరుతో చిరు వ్యాపారులపై అధికారుల జబర్దస్త్.?
- వ్యాపారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి
- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే రామస్వామి

**రంగారెడ్డి జిల్లా మహా:** ఈరోజు చేవెళ్ల మండల కేంద్రంలోని రైతు బజార్ ను సందర్శించిన సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే రామస్వామి అక్కడ ఉన్న చిరు వ్యాపారులతో వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని బస్టాండ్ దగ్గర హైదరాబాద్ బీజాపూర్ రహదారికి ఇరువైపులా చిన్నచిన్న షాపులు వేసుకొని పండ్లు, పువ్వులు, రోజువారీగా కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారులను ట్రాఫిక్ సమస్య కారణంగా మున్సిపల్, పోలీస్ సిబ్బంది ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, చిరు వ్యాపారస్తుల డబ్బాలను షాపులను తొలగించి రైతు బజార్ కు తరలించారు. కానీ రైతుబజార్ లో మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, కరెంటు వీధిలైట్లు, ఎలాంటి మౌలిక సదుపాయాలు లేక, చిరు వ్యాపారులు ప్రతిరోజు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాయంత్రం ఆరు దాటితే కారు



చీకట్లో వ్యాపారం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. కూరగాయలు పూలు పండ్లు కొనుక్కోవడానికి, వినియోగదారులు అక్కడ అంతా చీకటిగా ఉండడంతో అటుగా రావడానికి భయపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి రైతు బజార్లో కావలసిన మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని, లేనిచో చిరు వ్యాపారులతో రైతులతో పార్టీ శ్రేణులతో కలిసి హైదరాబాద్ బీజాపూర్ హైవే పైన పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని ప్రభుత్వానికి, అధికారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభులింగం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు



## రానున్న రోజుల్లో వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

### జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

**భూపాలపల్లి, మహా :** జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలంగా సేవలందించి పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీస్ అధికారులను పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భూపాలపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కిరణ్ ఖరే రిటైర్ అయిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సేవలు అత్యంత కఠినమైనవే. కుటుంబ క్షేమం కన్నా సమాజ క్షేమం కోసం మీరు నిరంతరం శ్రమించి, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ విధులను విజయవంతంగా నిర్వహించరాన్నారు. పదవీ విరమణ తర్వాత మీ ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలి. ఇకపై కుటుంబ సభ్యుల అభివృద్ధి కోసం సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ ఐ వి.సురేందర్ రెడ్డి, అడవిముత్తారం ఏ ఎస్ ఐ ఎ. మహేందర్, ఎం.డి. తాజుద్దీన్ లను ఘనంగా సన్మానించారు. కుటుంబ సభ్యులకు జ్ఞాపికలను అందజేశారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ సార్ ,అడ్మిన్ ఆర్ఐ రత్నం,ఆపరేషన్ ఆర్ఐ నగేష్, పోలీస్ సంఘం ప్రతినిధి మర్కాలయాదిరెడ్డి, రిటైర్డ్ సిబ్బంది కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## తొండం దేవర పాటను ఆవిష్కరించిన కార్పొరేటర్

**వరంగల్ మహా;** గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని అరణ్య ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణంలో తెలుగు ఇండియన్ ఐడల్ సింగర్ నజీరుద్దీన్ సింగర్ గా విరించి కార్తిక్ రచించిన తొండం దేవర పాటను రామ్ క్రిష్ దర్శకత్వంలో మ్యూజిక్ వీడియో ఆల్బమ్ రూపొందించబడింది. ఈ పాటను కళలను, కళాకారులను ప్రోత్సహించే మహోన్నతులుగా పేరుపొందిన 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ కుమార్ వరంగల్ పిన్నవారి వీధిలో భారీ సెట్టింగ్ ల మధ్య ఏర్పాటు చేసిన గణపతి మండపంలో ప్రముఖుల సమక్షంలో గందె కల్పన నవీన్ పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పాట మంచి భక్తి భావం, సులువుగా అర్థమయ్యే పదాలతో చాల చక్కగా చిత్రీకరించారని ప్రశంసించారు. ముఖ్యంగా ఈ



పాట విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రామ్ క్రిష్, అంకతి రవి కుమార్ , పొగాకు సదానందం, నట్టే నారాయణ, చిరు గౌడ్ , సోల శేఖర్ టి రమేష్, డి శ్రీనివాస్, నిఖిల్ పాల్గొన్నారు. ఈ పూర్తి పాట అరణ్య ఎంటర్టైన్మెంట్స్ యూట్యూబ్ ఛానల్ లో తొండం దేవర గా అందుబాటులో ఉందని పాట రచయిత తెలిపారు.



### రైతులను గోస పుచ్చుకుంటున్న చేతకాని

## ప్రభుత్వం దిగిపోవాలి

### రైతులకు వెంటనే యూరియా అందించాలని ధర్నా

### మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి

**భూపాలపల్లి మహా :** రైతులకు యూరియా ఇవ్వకుండా రైతులను గోస పుచ్చుకుంటున్న చేతకాని ప్రభుత్వం దిగిపోవాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రేగొండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ధర్నా చేశారు.భూపాలపల్లి నియోజకవర్గం లో యూరియా ఎరువు కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని బిఆర్ఎస్ పార్టీ ధర్నా లో ఖండించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ ఒక వైపు ఎరువుల కోసం యూరియా కోసం రైతన్నలు ఇబ్బందులు పడుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. భూపాలపల్లి నియోజకవర్గం లో యూరియా ఎరువు కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యం లో ఈ సమస్యపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వహిస్తున్న నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ట్రాఫిక్ సిఐ కే సుజాత

**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని 33వ డివిజన్ చిన్నబ్రిడ్జి, మేదరివాడ శ్రీ వినాయక నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజలు వరంగల్ ట్రాఫిక్ సిఐ కే సుజాత పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటుచేసిన మహా అన్నదానం కార్యక్రమాన్ని సిఐ కె సుజాత ప్రారంభించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## గణపతి మండపాల్లో అన్నదాన కార్యక్రమాలు

### ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని శాంతినగర్ లోని కేబిఆర్ అపార్ట్మెంట్స్ వాసులు నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలులో భాగంగా కట్కూర్ శితల్ సందీప్ ఆధ్వర్యంలో గణనాధునికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ప్రారంభించి భక్తులకు వడ్డించారు. అనంతరం వరంగల్ తూర్పు లోని ఆయా గణేష్ ఉత్సవ నిర్వాహకుల ఆహ్వానం మేరకు మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. నిత్యాన్నదానంలో భాగంగా 4వ రోజు అన్నప్రసాద వితరణ చేశారు.

## భూపాలపల్లి డిపో నుండి ప్రత్యేక టూర్ ప్యాకేజీలు

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి ఆర్టీసీ డిపో నుండి సెప్టెంబర్ నెలలో వివిధ ప్రాంతాలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ లు ఏర్పాటు చేసినట్లు భూపాలపల్లి డిపో మేనేజర్ ఏ ఇందు ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి డిపో నుండి సెప్టెంబర్ లో నిర్వహించే ప్రత్యేక టూర్ ప్యాకేజీలు 1) భద్రాచలం - 1 రోజు టూర్ ప్యాకేజీ 02092025,సూపర్ లగ్జరీ,ఛార్జీ ₹1000, 2) 9 వ తేదీన విజయవాడ - రాజమండ్రి - సమర్లకోట - పిఠాపురం - అన్నవరం - 3 రోజుల



టూర్ ప్యాకేజీ రూ 2300, 3) 16 తేదీన కానిపాకం - గోల్డెన్ టెంపుల్ - అరుణాచలం - కాంచీపురం - తిరుపతి - శ్రీకాళహస్తి - 5 రోజుల టూర్ ప్యాకేజీ, రూ 5300, 4) 23 తేదీ నుండి 26 వ తేదీ వరకు వైజాగ్ సిటీ టూర్ - 3 రోజుల ప్యాకేజీ, ఎక్స్ప్రెస్ కు ఛార్జ్ 2 వేలు.ఆసక్తి గల ప్రజలు ముందుగానే సీట్లు రిజర్వ్ చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా డిపో మేనేజర్ ఎ.ఇందు కోరారు.

## ప్రధాన రోడ్డు పక్కన నిలిచిన డ్రైనేజీ నీరు

### దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు.. పట్టించుకోని కార్పొరేటర్, బల్దియా అధికారులు

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం 24వ డివిజన్ పరిధిలోని గోపాలస్వామి గుడి సమీపంలో ఉన్న ఏ టు జెడ్ మెడికల్ షాప్ ముందు ఉన్న ప్రధాన రహదారి పై బస్ షెల్టర్ వద్ద గత కొన్ని రోజులుగా డ్రైనేజీ నీరు నిలిచి దుర్వాసన దోమలతో దుర్భలమైన పరిస్థితి ఏర్పడింది. ఈ డ్రైనేజీ కాలువల నుంచి నీరు రోడ్డుపైకి రావడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం డివిజన్ కార్పొరేటర్ కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వచ్చాయి. రోడ్ల పై వర్షపు నీరు, డ్రైనేజీ నీరు నిలవకూడదని బల్దియా పెద్దలు ఆదేశించిన వాటిని ఏమాత్రం అధికారులు సిబ్బంది పట్టించుకోవడం లేదని సమావేశాల్లో ఉన్నతాధికారులు చెప్పింది వినడం ఆ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించకపోవడం అధికారులకు సిబ్బందికి పరిపాటిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, సిబ్బంది స్పందించి రోడ్లపై నీరు నిలువకుండా అలాగే కాలనీలలో కూడా వర్షపు నీరు నిలవకుండా ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు వేడుకుంటున్నారు.





## నరేంద్ర మోడీపై వ్యాఖ్యలకు నిరసనగా భగ్గుమన్న బిజెపి

**భూపాలపల్లి, మహా :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అతని తల్లిపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం భూపాలపల్లి జిల్లా బిజెపి ఆధ్వర్యంలో తీవ్ర నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దగ్ధం ఎందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు ఏడు నూతల నిశీధర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. బిజెపి జిల్లా నాయకుని అక్రమంగా అరెస్టు చేయడం పట్ల బిజెపి నాయకులు తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి తీవ్ర నిరసన తెలిపారు.

## మానవత్వం చాటుకున్న దామెర సబ్ ఇన్స్పెక్టర్

### రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వాహనదారున్ని హాస్పిటల్ కు తరలింపు


**వరంగల్ మహా;** ములుగు లాదెళ్ళ రోడ్డు మార్గంలో కోతులు అడ్డురావడంతో ప్రమాదవశాత్తు వాహనం మీద నుండి కిందపడి తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్న వ్యక్తిని గమనించిన దామెర ఎస్సై అశోక్ తక్షణమే స్పందించి స్థానికులతో కలిసి గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం అంబులెన్సు లో ఆసుపత్రి కి తరలించడం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదం పై ఎస్ ఐ స్పందించిన తీరును స్థానికులు, ఇతర వాహనదారులు అభినందించారు.



# గణేష్ నిమజ్జన కార్యాక్రమాన్ని విజయవంతం చేద్దాం

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**వరంగల్ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 6683 గణపతి ప్రతిమలు పూజలందుకుంటున్నాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ తెలిపారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రశాంతవంతమైన వాతవరణంలో గణపతి నవరాత్రులు కోనసాగుతున్నాయని వినాయక చవితి పండుగ కొద్ది రోజుల ముందే వరంగల్ కమీషనరేట్ పోలీసులు నగర ప్రజలు గణపతి మండపాల నిర్వహణ పై నిర్వహకులతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడంతో గతంలో ఎప్పుడు లేని విధంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 6683 విగ్రహాలను ఏర్పాటు చేయగా ఇందులో సెంట్రల్ జోన్ పరిధిలో 2675 విగ్రహాలను నెలకోల్పగా, ఈస్ట్ జోన్ పరిధిలో 2043 విగ్రహాలు,



వెస్ట్ జోన్ పరిధిలో 1945 విగ్రహాలను ఏర్పాటు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరంలో 50%శాతం అధికంగా గణేష్ మండపాలు ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా ప్రజలు, మండప నిర్వహకులు సైతం పోలీసుల పిలుపునందుకోని 6526 విగ్రహాలకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీస్ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం విశేషం. విగ్రహాల సంఖ్య పెరిగిన సంబందిత స్టేషన్ పోలీస్ అధికారులు, సిబ్బంది మాత్రం మరింత ఉత్సహంతో తమ పరిధిలోని ప్రతి గణపతి నవరాత్రి మండపాలను సందర్శించడం తో పాటు, నిర్వహకులు ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్ల పై పోలీసులు క్షేత్ర స్థాయిలో పరిశీలించడం తో పాటు నిర్వహకులకు పలు సూచనలు కూడా చేస్తున్నారు. నగరంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాల ప్రదేశం వివరాలను ఖచ్చితంగా తెలుసుకోనేందుకు గాను స్థానిక పోలీసులు స్టేషన్ పరిధిలో విగ్రహాల వివరాలను జియో ట్యాగింగ్ చేయడం జరిగిందని ఈ ఏడాది మొత్తం 6354పైగా విగ్రహాలను జియో ట్యాగింగ్ చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా స్థానిక పోలీస్ అధికారులు పెట్రొలింగ్ సిబ్బంది సైతం పగలు, రాత్రి సమయాల్లో గణపతి మండపాలను సందర్శించడంతో పాటు ఈ మండపాలలో ఏర్పాటు చేసిన పాయింట్ బుక్‌ల్లో పెట్రో సిబ్బంది సంతకాలు చేయడం ద్వారా మండప నిర్వహకులను అప్రత్తం చేయడం జరుగుతోంది. అలాగే ప్రధానంగా ప్రతి స్టేషన్ అధికారి తమ పరిధిలో నెలకొల్పబడిన గణేష్ విగ్రహాలను సందర్శించడంతో పాటు, నిర్వహకులను ఎప్పటికప్పుడు తగిన రీతిలో సూచనలు చేస్తున్నారు.

# ఎస్బీఐ కేసును చేదించిన పోలీసులు

**47 మందిపై కేసు నమోదు...15.237 కిలోల బంగారం, 1,61,730 కోట్ల నగదు స్వాధీనం**

**9 రోజులలో కేసును చేదించిన మంచిర్యాల డిసిపి, జైపూర్ ఏసిపి లు**

**విలేకరుల సమావేశంలో రామగుండం సిపి అంబార్ కిషోర్ ఝ**



**మంచిర్యాల, మహా :** గత ఆగస్టు 23 నాడు చెన్నూరు ఎస్బిఐ2 బ్యాంకులో 25,17 కేజీల బంగారు ఆభరణాలు, 1,10, కోట్ల రూపాయల నగదు డిపాజిట్ల మాయం కేసును కేవలం తొమ్మిది రోజులలో చేదించి, 47 మందిపై కేసు నమోదు చేసినట్లు రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝు వెల్లడించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, జైపూర్ ఏసిపి ఏ వెంకటేశ్వర్, తదితర పోలీస్ బృందం సమక్షంలో వెల్లడించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ఎస్బిఐ2 బ్యాంకు లో 25,17 కిలోల బంగారు ఆభరణాలు, 1,10 రూపాయల నగదు డిపాజిట్ల కనబడడం లేదని బ్యాంకు రీజనల్ మేనేజర్ రితేష్‌కుమార్ గుప్తా ఆగస్టు 23 నాడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దీనితో కేసును దర్యాప్తు వేగవంతం కొరకు 4 పోలీసు బృందాలను ఏర్పాటు చేసి జైపూర్ ఏసిపి రాజేశ్వర్ కు అటాచ్ చేసినట్లు వెల్లడించారు. కాగా ఈ బృందాలు కేసును కేవలం తొమ్మిది రోజులలో ఛేదించి 15, 237 కేజీల బంగారు ఆభరణాలు,1,61,730 కోట్ల రూపాయల నగదును స్వాధీనం చేసుకుని 44 మందిని అరెస్టు చేసి సెక్షన్ 318(4), 316(5), 314, 61(2)(బి), 306, 317(2) ఆర్/డబ్ల్యూ49 బి.ఎన్.ఎస్.అండ్ సెక్షన్ 65, 66(సి), 66(డి) అఫ్ ఐ టి యాక్ట్ లపై చెన్నూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అరెస్టు అయినవారిలో ప్రధాన నిందితుడు నరిగె రవీందర్ (క్యాషియర్) ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అక్టోబర్ 2024కు ముందే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు పోగొట్టుకుని ఆ నష్టాన్ని పూడ్చుకోవడం కోసం మరింత బెట్టింగ్ కొనసాగించడానికి బ్రాంచ్ మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌తో కలిసి మోసానికి పాల్పడినట్లు తెలిపారు. బ్యాంక్ కరెన్సీ చెస్ట్ యొక్క తాళం మేనేజర్, క్యాషియర్ సంయుక్త ఆధీనంలో ఉండగా మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్ తన తాళాన్ని క్యాషియర్‌కు ఇచ్చినట్లు తెలిపారు. వీరి సహకారంతో బంగారం, నగదు దొంగిలించేందుకు పథకం రూపొందించినట్లు వెల్లడించారు. ఇలా అక్టోబర్ 2024 నుండి తరచూ గోల్డ్ లోన్ చెస్ట్ నుండి బంగారం తీసి, తన స్నేహితులకు ఆ బంగారాన్నిఇతర ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలలో తాకట్టు పెట్టి, డబ్బును తమ ఖాతాల్లో జమ చేసి, కొంత కమిషన్ సహకరించిన వారికి ఇచ్చేవాడని ఆయన తెలిపారు. ఇప్పటివరకు నిందితులు 10 ప్రైవేట్ గోల్డ్ లెండింగ్ కంపెనీలలో 44 మంది పేర్లపై 142 గోల్డ్ లోన్లు తీసుకున్నాడని స్పష్టం చేశారు. బంగారం తాకట్టు విషయంలో ఇతర బ్యాంకు మేనేజర్ల ప్రమేయం కూడా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. అరెస్టు అయిన వారిలో నరిగె రవీంధర్ (క్యాషియర్) వెన్నపురెడ్డి మనోహర్ (బ్రాంచ్ మేనేజర్) లక్కాకుల సందీప్ (అటెండర్), కొంగొండి బీరేష్, కోదాటి రాజశేఖర్, బొల్లి కిషన్ కుమార్, ఉమ్మాల సురేష్, నడిగొట్టు సాగర్,రాంశెట్టి చంద్రబాబు, భరతపు రాకేష్, దిగుట్ల సునీల్, కడం రమేష్,దారపు నాగరాజు, నిట్టూరి రాజు, కంబాల మహేష్, కంది మల్లేష్, జూపాక సత్యనారాయణ, దయ్యాల మహేందర్, ఉరుగుండ పరంధాములు, కుమ్మరి నగేష్, మహ్మద్ రషీద్, దాడి రాజ్‌కుమార్, కన్నం రాకేష్, నేరడిగొండ అనిల్ సాయి, దుర్కి ప్రవీణ్ కుమార్, బొడ్డుపల్లి ప్రశాంత్, మంతెన రాజశేఖర్, కొమ్ము మహేష్, పంచల శశిధర్, దుర్గం మనోహర్, ప్రభుత్వం జాకవర్ మహేష్, మహమ్మద్ హబీబ్ పాషా, జంగంపల్లి యుంగేందర్, మహమ్మద్ సమీరుద్దీన్, మోతుకూరి శ్రీనివాస్, తాళ్లండి అనాజయ్య, నిమ్మతి సుమ, పాణి రవళిఖా, ఈసంపల్లి సాయికిరణ్, నరిగె స్వర్ణలత, గౌడ సుమన్, తుండ్ల సురేష్, జుర్రు శ్రీనివాస్, తుంగపిండి శేఖర్,నరిగె సరిత, మోతుకూరి రమ్య, అగిడి మొగిలి ఉన్నట్లు తెలిపారు. ఈ కేసును తక్కువ కాలంలోనే చాకచక్యంగా ఛేదించిన చెన్నూరు సిఐ దేవేందర్ రావు, రూరల్ సీఐ ఆర్. బన్సీలాల్, శ్రీరాంపూర్ సీఐ డి వేను చందర్ తదితరులను ఆయన అభినందించారు.



## మందమర్రి గిరిజన ఉద్యోగుల అధ్యక్షులుగా
# బానోత్ రాము నాయక్

- **సింగరేణి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి**
- **ఎన్నికలకు కేంద్ర కమిటీ అధ్యక్షులు ధరావత్ పంతుల నాయక్**

**మందమర్రి, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియా సింగరేణి గిరిజనుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా రాము నాయక్ ఎన్నికైనట్లు ఆ సంఘం (7856/2001) కేంద్ర కమిటీ అధ్యక్షులు ధరావత్ పంతుల నాయక్, బెల్లంపల్లి రీజియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి భూక్య పరశురాం, లైజన్ అధికారి గుగులోత్ బాబు జాదవ్ లు వెల్లడించారు. ఆదివారం స్థానిక సింగరేణి సిఈఆర్ క్లబ్ లో ఆ సంఘం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ నేటి నూతన కమిటీ సింగరేణి సంస్థ ఎదురు నిర్వహిస్తున్న గిరిజనుల హక్కుల సాధన కొరకు పాటుపడాలని అన్నారు. పరిష్కృత సమస్యలను కేంద్ర కమిటీ దృష్టికి తీసుకువచ్చి వాటి సాధనకు కృషి చేయాలని వారు వివరించారు. అనంతరం నూతన కమిటీని వారు ప్రకటించారు. ఏరియా అధ్యక్షులుగా ఏరియా అధ్యక్షులుగా బానోత్ రాము నాయక్ (సివిల్ ఇంజనీర్) గౌరవ అధ్యక్షులుగా వాంకుడోత్ దుప్ సింగ్, ఉపాధ్యక్షులుగా గుగులోత్ రాంబాబు, రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా ధారావత్ తిరుపతి , వర్కింగ్ ప్రెసిడెంట్ గా అశోక్ , ఆర్గనైజింగ్ సెక్రటరీగా భూక్య ప్రవీణ్ , కోశాధికారిగా బాలకృష్ణ , సంయుక్త కార్యదర్శిగా భూక్యా రవి ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని స్పష్టం చేశారు.



## ఆదిలాబాద్‌లో
# నకిలీ డిటర్జెంట్ పౌడర్ దందా

- **15 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు**
- **నలుగురిపై కేసు నమోదు- ముగ్గురి అరెస్టు**

**ఆదిలాబాద్ మహా :** ఒక బ్రాండ్ కు చెందిన నకిలీ డిటర్జెంట్ పౌడర్ బ్యాగులను పట్టుకుని నలుగురిపై కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన రూపేష్ అగర్వాల్ అనే వ్యక్తి అమరావతి నుండి నకిలీ ఘడి డిటర్జెంట్ ను తీసుకువచ్చి ఆదిలాబాద్, మహారాష్ట్రలోని జివితి ప్రాంతానికి చెందిన వ్యాపారులకు అమ్ముతున్నాడన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిలాబాద్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాంసి బస్టాండ్ ప్రాంతం నందు ఆదిలాబాద్ టూ టౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్ ఆధ్వర్యంలో సిబ్బంది బొలెరో వాహనం తనిఖీ చేయగా అందులో 60 బ్యాగులలో దాదాపు 15 క్వింటాళ్ల నకిలీ డిటర్జెంట్ ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నట్టు డిఎస్పి చెప్పారు. ఆదిలాబాద్ పట్టణంలో ఎలాంటి నకిలీవి చలామణిలో ఉన్న తగిన సమాచారాన్ని పోలీసు వ్యవస్థకు అందజేయాలని వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. కేసు నమోదైన నలుగురిలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఏ ఫోర్ నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు, ఎస్సై విష్ణు ప్రకాష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులను గోస పుచ్చుకుంటున్న చేతకాని ప్రభుత్వం దిగిపోవాలి

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి**



**భూపాలపల్లి మహా :** రైతులకు యూరియా ఇవ్వకుండా రైతులను గోస పుచ్చుకుంటున్న చేతకాని ప్రభుత్వం దిగిపోవాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రేగొండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ధర్నా చేశారు.భూపాలపల్లి నియోజకవర్గంలో యూరియా ఎరువు కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని బిఆర్ఎస్ పార్టీ ధర్నా లో ఖండించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ ఒక వైపు ఎరువుల కోసం యూరియా కోసం రైతన్నలు ఇబ్బందులు పడుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. భూపాలపల్లి నియోజకవర్గం లో యూరియా ఎరువు కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యం లో ఈ సమస్యపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వహిస్తున్న నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రైతు సమస్యల పట్ల ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విత్తనాలు వేసి పంటలు మొలకెత్తిన దశలో యూరియా అందక రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, అసెంబ్లీ సమావేశాల్లో రైతుల సమస్యలే ప్రధాన ఎజెండా గా చర్చ జరపాల్సిన అవసరం ఉంది,కానీ ఆ విషయాన్ని పక్కకు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజకీయ ప్రయోజనాలే ధ్యేయంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని ఆరోపించారు.ఇప్పటికైనా ప్రభుత్వం బెషజాలకు పోకుండా ఎరువులు, యూరియా పై తక్షణమే స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



## రూరల్ పోలీస్ స్టేషన్ వినాయకుడు నిమజ్జనం

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఐదు రోజులు పూజలు అందుకున్నా గణనాధుని ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో పాటలు పాడుతూ ఆటలాడుతూ గణేష్ మహరాజ్కీ జై అంటూ అగిలేబరాస్ తూ... జల్దియ్..హా అంటూ నినాదాలు చేస్తూ రూరల్ పోలీస్ స్టేషన్ గణనాథుడు పెద్ద షాపూర్ చెరువులో నిమజ్జనం చేశారు.

## బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి హౌస్ అరెస్ట్



**రాజేంద్రనగర్ మహా ;** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తల్లి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ వాక్యాలను తీవ్రంగా ఖండిస్తూ, రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దహనం చేసే కార్యక్రమానికి వెళ్తున్న సమయంలో, రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ని మైలార్దేవుపల్లి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ కాంగ్రెస్ నాయకులు దేశ ప్రధాని నరేంద్ర మోడీ తల్లిని అసభ్య పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం ప్రధానమంత్రిని అవమానించడం మాత్రమే కాదు, భారతదేశ మాతృమూర్తుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న అసభ్య దృక్పథాన్ని స్పష్టంగా చూపిస్తుందని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీ వెంటనే తన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణలు చెప్పాలని బిజెపి రాజేంద్రనగర్ ఇన్చార్జ్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిని డిమాండ్ చేశారు.



## గణనాధుని ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఐ నాగేశ్వరరావు

**రాజేంద్రనగర్ మహా ;**రాజేంద్రనగర్ అత్తాపూర్ రాంబాగ్ లోని తన్సిక గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టింపజేసిన గణనాధుని ఆదివారం అత్తాపూర్ సిఐ నాగేశ్వరరావు ఎస్సై శ్రీనివాస్ బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు వనం శ్రీరామ్ రెడ్డి, శివ కుమార్,జయశ్రీ, చరణ్య,జస్వంత్, బాలమురళీకృష్ణ లు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 500 మందికి పైగా అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం తన్సిక గణేష్ యూత్ అసోసియేషన్ గణేష్ నవరాత్రులను అద్భుతంగా నిర్వహిస్తుంది. క్రమశిక్షణతో గణేష్ మండపాల వద్ద పలు జాగ్రత్తలు పాటించాలని సిఐ నాగేశ్వరరావు తెలిపారు.

## రానున్న రోజుల్లో వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే**



**భూపాలపల్లి, మహా :** జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలంగా సేవలందించి పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీస్ అధికారులను పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భూపాలపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కిరణ్ ఖరే రిటైర్ అయిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సేవలు అత్యంత కఠినమైనవే. కుటుంబ క్షేమం కన్నా సమాజ క్షేమం కోసం మీరు నిరంతరం శ్రమించి, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ విధులను విజయవంతంగా నిర్వహించరాన్నారు. పదవీ విరమణ తర్వాత మీ ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలి. ఇకపై కుటుంబ సభ్యుల అభివృద్ధి కోసం సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ ఐ వి.సురేందర్ రెడ్డి, అడవిముత్తారం ఏ ఎస్ ఐ ఎ. మహేందర్, ఎం.డి. తాజుద్దీన్ లను ఘనంగా సన్మానించారు. కుటుంబ సభ్యులకు జ్ఞాపికలను అందజేశారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ సార్ ,అడ్మిన్ ఆర్ఐ రత్నం,ఆపరేషన్ ఆర్ఐ నగేష్, పోలీస్ సంఘం ప్రతినిధి మర్కాలయాదిరెడ్డి, రిటైర్డ్ సిబ్బంది కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులపై సిఐటియు సమరశీల పోరాటాలు

**సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్**



**రంగారెడ్డి జిల్లా మహా:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని పాలడుగు భాస్కర్ అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జె. రుద్రకుమార్ అధ్యక్షతన స్థానిక కాటేదాన్ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, జిల్లా గైడ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ హాజరై మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాన్ని రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం కార్మికుల హక్కులను హరించడమే అని అన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం పోయి 12 గంటలకు పెరిగిందని, రంగారెడ్డి జిల్లాలో అనేక పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులతో కంపెనీ యాజమాన్యాలు వెట్టి చాకిరి చేయిస్తున్నారని అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని కంపెనీలలో అనేక ప్రమాదాల వల్ల కార్మికుల పిట్టల రాలిపోతున్నారని, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అయినా కార్మిక శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. మొన్న సౌత్ క్లాస్ ఇండస్ట్రీలో ప్రమాదం, నిన్న పాశమైలారం సిగాచి పరిశ్రమలో ప్రమాదం రేపు ఏ పరిశ్రమలో ఏ ప్రమాదం జరిగి ఏ కార్మికుడు చనిపోతాడు తెలియని అయోమయంలో వలస కార్మికులు ఉన్నారు. 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టాన్ని రంగారెడ్డి జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కార్మిక శాఖ అధికారులను డిమాండ్ చేశారు. అలాగే స్కీం వర్కర్లు అయిన అంగనవాడి ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని మండిపడ్డారు. వెంటనే స్కీం వర్కర్లను పర్మనెంట్ చేయాలని, పరిశ్రమంలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాల జీవోలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గెజిట్ చేయాలని, 26 వేల కనీస వేతనం ఉండేటట్లు చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏం చంద్రమోహన్, కోశాధికారి కవిత, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్, డి జగదీష్, నర్సిరెడ్డి, అల్లి దేవేందర్, జిల్లా సహాయ కార్యదర్శిలు రామ్మోహన్, స్వప్న, వీరయ్య, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మీ బాలాజీ నగర్ లో సిద్ధిబుద్ధి సమేత వినాయకుని
# కళ్యాణోత్సవం


**మంచిర్యాల, మహా :** మంచిర్యాల పట్టణంలోని లక్ష్మీ బాలాజీ నగర్ లో గణేష్ మండపంలో ఆదివారం సిద్ధిబుద్ధి సమేత వినాయకుని కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. వరుడి తరపున నూతి కట్ల మార్కండేయులు దంపతులు, వధువు తరపున సిరిపురం గంగాధర్ దంపతులు ఒకరినొకరు ఎదుర్కొని సాంప్రదాయ పద్ధతిన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సిద్ది బుద్ధి సమేత వినాయక విగ్రహాలతో పలు వాడలలో ఊరేగింపు నిర్వహించారు. వేద బ్రాహ్మణ మంత్రోచ్చారణల మధ్య సిద్ధిబుద్ధి సమేత వినాయకుని కళ్యాణాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. అనంతరం ఆర్య ప్రాంగణంలో మధుకర్ దంపతుల అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



## నరేంద్ర మోడీపై వ్యాఖ్యలకు నిరసనగా భగ్గుమన్న బీజేపీ

**భూపాలపల్లి, మహా :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అతని తల్లిపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం భూపాలపల్లి జిల్లా బిజెపి ఆధ్వర్యంలో తీవ్ర నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దగ్ధం ఎందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు ఏడు నూతల నిశీధర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. బిజెపి జిల్లా నాయకుని అక్రమంగా అరెస్టు చేయడం పట్ల బిజెపి నాయకులు తీవ్రంగా ఖండించారు. గోరి కొత్తపల్లి, చిట్యాల బిజెపి మండల శాఖల ఆధ్వర్యంలో ఆయా మండల కేంద్రాలను రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి తీవ్ర నిరసన తెలిపారు.

## ప్రతి సంవత్సరం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తాం




**సయ్యాగ్ చారిటబుల్ ట్రస్ట్**

**రాజేంద్రనగర్, మహా ;** సయ్యోగ్ చారిటబుల్ ట్రస్టు సేవా సంస్థ ఆధ్వర్యంలో మణికొండ మర్రిచెట్టు కూడలిలోని మున్సిపల్ కమ్యూనిటీ హాల్ లో మెడికేర్ డయాగ్నొస్టిక్ ఓయు కాలనీ సహకారంతో మేఘా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్యులు గైనకాలజిస్ట్ డాక్టర్ జయశ్రీ రెడ్డి, కార్డియాలిస్ట్ డాక్టర్ శ్రీరాములు కడియాల, ఆర్థోపెడిక్ డాక్టర్లు రవి తేజ, రవీష్ అజ్మీరా, న్యూరో డాక్టర్ శ్యామ్ కె జైస్వాల్, ఆంకాలజిస్ట్ డాక్టర్ నిషీత్ వడ్డెబోయిన, జనరల్ ఫిజియన్ డాక్టర్లు పిపి రమ్యా, డాక్టర్ కృష్ణయ్యజీ, ఫ్యామిలీ ఫిజియన్ డాక్టర్ నరసింహ రావు, డెంటల్ డాక్టర్ శ్రీకాంత్, సైకాలజిస్ట్ వినీల అన్నే, ఆక్యుపంక్చర్ డాక్టర్ మనోహర్ ల పర్యవేక్షణలో దాదాపు వెయ్యికి మందికి పైగా రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. మందులతో పాటు, సంబంధిత ఫైబ్రో స్కాన్, బాడీ మాస్ ఇండెక్స్, డయాబెటిక్ న్యూరో పతి, లిపిడ్ ప్రొఫైల్, టుడిఎకో, ఈసిజీ, హెచ్బిఏ 1,సి, విటమిన్ డి, షుగర్ టెస్ట్ బీపీ టెస్ట్ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఉచిత వైద్య శివరాన్ని మణికొండ మున్సిపాలిటీ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



**ఆమనగల్లు, మహా:** దేశ ప్రధాని నరేంద్ర మోడీ మాతృమూర్తి పై బీహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం ఆమనగల్లు మండల కేంద్రంలోని రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్ గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రధానికి ఆయా దేశ ప్రజలు నీరాజనం పడుతుంటే రాహుల్ గాంధీ దేశ ప్రధానిపై వారి తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.బహిరంగ క్షమాపణ చెప్పక పోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు..ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్పిటిసి కండె హరిప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నరసింహ, జిల్లా కౌన్సిల్ నంబర్ చెక్కల లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్స్ కృష్ణ యాదవ్, చెన్నకేశవులు, శ్రీకాంత్ సింగ్, శేఖర్, ఆమనగల్లు మండలం బిజెపి పార్టీ అధ్యక్షులు ఎర్రవోలు శ్రీనివాస్, పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ పద్మ ప్రశాంత్, ఆమనగల్లు బీజేవైఎం అధ్యక్షులు శ్రీనివాస్,నరేందర్ రాథోడ్, బాలు, భగవాన్ రెడ్డి, వెంకటయ్య, మహేష్, ఎల్కే ఆద్వానీ, శంకర్రావు, కృష్ణారావు,లక్య నాయక్ బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు
# ఉచితంగా మందులు ఇవ్వాలి

**తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్**



**మంచిర్యాల, మహా :** తెలంగాణ రాష్ట్రంలో సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మందులు ఇవ్వాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య సుమారు 10 నుంచి 12,000 వేల మంది ఉన్నట్లు తెలిపారు. ఈ వ్యాధి జన్యు పరంగా వంశపారంపర్యంగా వచ్చే వ్యాధనీ, ఇది దీర్ఘకాలికంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వ్యాధి బారిన పడ్డ వ్యాధిగ్రస్తులు జీవితాంతం మందులు వాడవలసి ఉంటుందని వెల్లడించారు. హైడ్రాక్స్యూరియా, సోడా మింట్, పెంటెడ్స్, టాబ్లెట్లు ప్రభుత్వము ఉచితంగా అందించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ వైద్యశాలలో వివిధ రోగాల బారిన పడ్డ ప్రజలకు ఏ విధంగా మందులు ఇస్తున్నారో అదే విధంగా మందులను రాష్ట్రంలోని ప్రతి జిల్లా హాస్పిటల్, పీహెచ్సీ లో అందుబాటులో ఉంచి ఆశా వర్కర్ల ద్వారా గ్రామాలలో ఉన్న సికిల్ సెల్ పేషెంట్లకు అందజేయాలని, ఇది నిరంతర ప్రక్రియగా చేపట్టాలని వివరించారు. ఈ వ్యాధి ఆదివాసి గిరిజన జిల్లాలలో ఎక్కువగా ఉందని అన్నారు.

# ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ కొత్తగా వేస్తున్నారా?..

మీరు వేతన జీవి అయినా, ఫ్రీలాన్సర్ లేదా ఇప్పుడే జాబ్ మార్కెట్లోకి ప్రవేశించినప్పటికీ, మొదటిసారి ఆదాయపు పన్ను రిటర్న్స్ (ITR) దాఖలు చేయడం సంక్లిష్టంగా అనిపించవచ్చు. అందుకే ఆదాయపు పన్ను శాఖ తరచుగా ఐటీ రిటర్నులను సౌకర్యవంతంగా, వేగంగా దాఖలు చేయడానికి చిట్కాలు, పద్ధతులను తెలియజేస్తుంటుంది. ఐటీఆర్ దాఖలు చేయడానికి ముందు, పన్ను చెల్లింపుదారులు ఇన్‌కమ్ ట్యాక్స్ పోర్టల్లో నమోదు చేసుకోవడం చాలా అవసరం. ఫైలింగ్ ప్రక్రియను సజావుగా, సౌకర్యవంతంగా చేయడానికి, ఐటీఆర్ పోర్టల్లో ఎలా నమోదు చేసుకోవాలన్నదానిపై ఆదాయపు పన్ను శాఖ వివరణాత్మక గైడ్‌ను షేర్ చేసింది. ఈపోర్టల్లో నమోదు చేసుకోవడానికి దశల వారీ గైడ్‌ను వివరిస్తూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది.




**ఐటీఆర్ పోర్టల్లో రిజిస్టర్ చేసుకోండిలా..**

**స్టెప్ 1:** ఆదాయపు పన్ను శాఖ అధికారిక వెబ్‌సైట్ www.incometax.gov.inకు వెళ్లండి. హోమ్ పేజీ ఎగువ కుడి వైపు మూలలో ఉన్న 'రిజిస్టర్' బటన్ పై క్లిక్ చేయండి.

**స్టెప్ 2:** యూజర్ టైప్ ట్యాబ్ లో 'ట్యాక్స్ పేయర్' ఎంచుకొని 'కంటిన్యూ' క్లిక్ చేయాలి.

**స్టెప్ 3:** 'పాన్' ఆప్షన్లో పర్మినెంట్ అకౌంట్ నెంబర్ ఎంటర్ చేసి 'వెలిడేట్' క్లిక్ చేయాలి. మీరు ఆధార్‌తో పాన్ తప్పనిసరిగా లింక్ అయి ఉండాలి.

**స్టెప్ 4:** పాన్ వివరాలను ఇచ్చిన తర్వాత, మీ ఆధార్ లింక్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే వన్ టైమ్ పాస్వర్డును ఎంటర్ చేసి, 'కంటిన్యూ' మీద క్లిక్ చేయండి.

**స్టెప్ 5:** పూర్తి పేరు, పుట్టిన తేదీ, జెండర్, నివాస స్థితితో సహా ప్రాథమిక సమాచారాన్ని అందించండి. ఈ వివరాలను నమోదు చేసిన తర్వాత 'కంటిన్యూ' ఎంచుకోండి.

**స్టెప్ 6:** చెల్లుబాటులో ఉన్న కాంటాక్ట్ నెంబరు, ఈమెయిల్ ఐడీ, పూర్తి నివాస చిరునామా వంటి కాంటాక్ట్ వివరాలను నమోదు చేసి 'కంటిన్యూ' మీద క్లిక్ చేయండి.

**స్టెప్ 7:** మీరు ఇచ్చిన కాంటాక్ట్ నెంబరు, ఈమెయిల్ ఐడీపై రెండు వేర్వేరు ఆరు అంకెల ఓటీపీలను మీరు అందుకుంటారు. తర్వాత మీ కాంటాక్ట్ వివరాలను ధృవీకరించి సంబంధిత ఫీల్డ్ ల్లో ఓటీపీలను నమోదు చేయండి. ఒకవేళ మీకు ఓటీపీలు రాకపోతే 'రీసెండ్ ఓటీపీ'పై క్లిక్ చేయండి


**స్టెప్ 8:** ఇప్పటివరకు అందించిన సమాచారం అంతటిని సమీక్షించుకుని అన్నీ సరిగ్గా ఉన్నట్లయితే 'కన్ఫర్మ్' మీద క్లిక్ చేయండి.

**స్టెప్ 9:** బలమైన పాస్‌వర్డ్‌ను క్రియేట్ చేసుకుని మీ లాగిన్ క్రెడెన్షియల్స్ ను ధృవీకరించండి. తరువాత, ధృవీకరించడానికి అదే పాస్‌వర్డ్‌ను మళ్లీ నమోదు చేయండి. చివరగా, వ్యక్తిగతీకరించిన లాగిన్ సందేశాన్ని సెట్ చేయండి. మీరు ఫిషింగ్ వెబ్‌సైట్‌లో లేరని, అధికారిక ఐటీ వెబ్‌సైట్లో ఉన్నారని నిర్ధారించడానికి ఈ దశ సహాయపడుతుంది.

**పాస్ వర్డ్ పాలసీ:**

కనీసం 8 క్యారెక్టర్లు, గరిష్ఠంగా 14 క్యారెక్టర్లు ఉండాలి. ఇందులో అప్పర్ కేస్, లోయర్ కేస్ అక్షరాలు రెండూ ఉండాలి. ఒక సంఖ్య, ఒక ప్రత్యేక అక్షరాన్ని కలిగి ఉండాలి (ఉదా. @#$%).

**స్టెప్ 10:** రిజిస్టర్ పై క్లిక్ చేయాలి. దీంతో మీ ఈఫైలింగ్ అకౌంట్ క్రియేట్ అయ్యి లాగిన్ పేజీకి వెళ్తారు.




## పేషెంట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్‌లో కొత్త కోర్సు

**ముంబయి:** పేషెంట్ రిలేషన్ షిప్ మేనేజ్ మెంట్ లో 'బాండింగ్' పేరుతో కొత్త ట్రైనింగ్ మాడ్యూల్ ను ప్రారంభించినట్లు ఎగ్జిక్యూటివ్ కోచింగ్ సంస్థ ఓరియల్ అకాడమీ ప్రకటించింది. హెల్త్ కేర్, మెడికల్, పారామెడికల్, హాస్పిటల్ సపోర్ట్, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది కోసం ఈ కోర్సును రూపొందించారు. ఆసుపత్రులు అధునాతన వైద్య సంరక్షణ, రోగనిర్ధారణను అందిస్తున్నప్పటికీ, చాలా మంది ఇప్పటికీ రోగులతో అర్థవంతంగా మెలగడంలో కష్టపడుతున్నారు. ఈ అంతరాన్ని పూడ్చడానికి, ఆరోగ్య సంరక్షణ నిపుణులు ఎదుర్కొంటున్న వాస్తవ ప్రపంచ సవాళ్ల చుట్టూ రూపొందించిన ప్రత్యేక శిక్షణ మాడ్యూల్ 'బాండింగ్'ను ఓరియల్ అకాడమీ ప్రవేశపెట్టింది. 'సమర్థత, సహానుభూతి, రోగిమొదటి ప్రాధాన్యతగా సేవ సంస్కృతిని పెంపొందించడం ఈ కోర్సు లక్ష్యం. బలమైన సాఫ్ట్ స్కిల్స్ ను పెంపొందించుకోవడం ద్వారా, హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ సవాళ్లను మరింత సమర్థవంతంగా ఎదుర్కోగలరు. రోగులు, సిబ్బందికి సానుకూల అనుభవాలను సృష్టించవచ్చు" అని ఓరియల్ అకాడమీ ప్రిన్సిపల్ కన్సల్టెంట్ ఖలీద్ జమాల్ పేర్కొన్నారు.

## భారత్‌లోకి మళ్లీ టిక్‌టాక్?

### మొదలైన నియామకాలు




భారతదేశంలో ఒకప్పుడు ఎంతో ప్రాచుర్యం పొంది.. ఇప్పుడు నిషేధంలో ఉన్న ప్రముఖ సోషల్ మీడియా యాప్ 'టిక్‌టాక్' ఉద్యోగుల కోసం ఎదురు చూస్తోంది. గురుగ్రామ్‌లోని ఆఫీసులో రెండు ఖాళీలను భర్తీ చేయనున్నట్లు లింక్డిన్‌లో పోస్ట్ చేసింది. ఇందులో ఒకటి కంటెంట్ మోడరేటర్ (బెంగాలీ స్పీకర్), మరొకటి మంచి భాగస్వామ్యం.. కార్యకలాపాల లీడ్ కోసం. దీన్నిబట్టి చూస్తుంటే టిక్‌టాక్ మళ్ళీ భారత్‌లోకి అందుబాటులోకి రానుందా అనే ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి. బైట్‌డాన్స్ యాజమాన్యంలోని షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ కంపెనీ వెబ్‌సైట్ ఇటీవల భారతదేశంలో మళ్లీ అందుబాటులోకి వచ్చింది. అయితే.. దేశంలో టిక్‌టాక్ సేవలను తిరిగి ప్రారంభించడానికి కావలసిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేయలేదని అధికారులు తెలిపారు. ఆగస్టు 22న, కూడా ఈ చైనా యాప్ భారతదేశంలో తిరిగి అనుమతించారనే వాదనలను అధికారులు తిరస్కరించారు. టిక్‌టాక్ వెబ్‌సైట్‌లోని ల్యాండింగ్ పేజీ ఓపెన్ చేయగానే.. భారతదేశంలో ఇది అందుబాటులో లేదని సందేశాన్ని ప్రదర్శించేది. కానీ గత వారం డెస్క్‌టాప్ ద్వారా యాక్సెస్ చేసినప్పుడు ఈ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించిన 'అబౌట్ అస్' పేజీ కనిపించింది. అయితే ఎలాంటి వీడియోలు కనిపించలేదు. టిక్‌టాక్ యాప్ ఆండ్రాయిడ్ ప్లే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో లేదు. "మేము భారతదేశంలో టిక్‌టాక్‌కు మళ్ళీ స్టార్ట్ చేయలేదు. ఇప్పటికి కూడా భారత ప్రభుత్వ ఆదేశాన్ని పాటిస్తూనే ఉన్నాము" అని టిక్‌టాక్ ప్రతినిధి ఒకరు ఒక ప్రకటనలో తెలిపారు.

భారత.. చైనా దళాల మధ్య గాల్వాన్ లోయ ఘర్షణ తర్వాత జాతీయ భద్రతా సమస్యలను పేర్కొంటూ భారతదేశం జూన్ 2020లో టిక్‌టాక్‌తో పాటు 58 ఇతర చైనీస్ యాప్‌లను నిషేధించింది. అయితే ఇప్పుడు ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడే సంకేతాలను కనిపిస్తున్నాయి. ఏడేళ్ల తరువాత ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే.. చైనా సోషల్ మీడియా యాప్ మళ్ళీ అందుబాటులోకి వస్తుందేమో అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

## సుజుకి కీలక ప్రకటన.. 5000 బైకులపై ప్రభావం!

సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా.. భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన జిక్సర్ 250, జిక్సర్ ఎస్ఎఫ్ 250 బైకులకు రీకాల్ జారీ చేసింది. వెనుక బ్రేక్ సమస్యల కారణంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. 2022 ఫిబ్రవరి నుంచి 2026 జూన్ మధ్యలో తయారైన 5145 యూనిట్ల బైకులపై ఈ రీకాల్ ప్రభావం పడింది. అయితే వినియోగాదారుల నుంచి ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా బ్రాండ్ ఈ సమస్యను పరిష్కరిస్తున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. వెనుక బ్రేక్ సమస్య తలెత్తడానికి ప్రధాన కారణం.. ప్యాడ్‌లు, బ్రేక్ డిస్క్‌ల మధ్య సరైన కనెక్షన్ లేకపోవడమే. అత్యవసర సమయంలో బ్రేకింగ్ సమస్య ఏర్పడుతుంది. కాబట్టి కంపెనీ దీనిని పరిష్కరించడానికి ఈ రీకాల్ జారీ చేసింది. ఫిబ్రవరి 2024లో కూడా ఇంజిన్ క్యామ్‌షాఫ్ట్ సమస్య కారణంగా సుజుకి జిక్సర్ 250, జిక్సర్ ఎస్ఎఫ్ 250, వీస్ట్రామ్ ఎస్ఎక్స్ బైకులకు రీకాల్ జారీ చేసింది. సుజుకి జిక్సర్ 250, జిక్సర్ ఎస్ఎఫ్ 250 వినియోగదారులు బైకులోని సమస్యను పరిష్కరించుకోవడానికి సమీపంలోని సర్వీస్ సెంటర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ, సాంకేతిక నిపుణులు మోటార్‌సైకిల్‌ను తనిఖీ చేసి, కస్టమర్‌కు ఎటువంటి ఖర్చు లేకుండా అవసరమైన మరమ్మతులు చేస్తారు. సుజుకి జిక్సర్ 250.. జిక్సర్ ఎస్ఎఫ్ 250 బైకులు 249సీసీ సింగిల్ సిలిండర్ ఆయిల్ కూల్డ్ ఇంజిన్ ద్వారా శక్తిని పొందుతుంది. ఇది 26.5 హార్స్ పవర్, 22 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్‌తో లభిస్తుంది. పనితీరు పరంగా ఉత్తమంగా ఉంటుంది.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## ద్వైపాక్షిక సహకారంతోనే ప్రజా సంక్షేమం: ప్రధాని మోదీ



**తియాంజిన్:** 'పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం ఆధారంగా ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడానికి మేము కట్టుబడి ఉన్నాము' అని అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో చర్చల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇరుదేశాల ప్రజల సంక్షేమం ఈ ద్వైపాక్షిక సహకారంతో ముడిపడి ఉందన్నారు. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఎస్‌సీఓ సదస్సులో భాగంగా వీరి మధ్య భేటీ జరిగింది. ఏడేళ్ల తర్వాత చైనాలో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ.. చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో ఆదివారం ద్వైపాక్షిక చర్చలు చేపట్టారు. అమెరికా భారీ సుంకాల నేపథ్యంలో ఇరు దేశాల మధ్యనున్న విభేదాలను పక్కన పెట్టి, రెండు ఆసియా పొరుగు దేశాలు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్న వేళ ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది.

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు 2025 కోసం చైనాలోని తియాంజిన్ నగరానికి చేరిన ప్రధాని, అక్కడ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పాటు అనేక మంది ప్రపంచ నాయకులతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలోనే మోదీ.. జిన్‌పింగ్‌తో సమావేశం అయ్యారు. దాదాపు 10 నెలల తర్వాత ఈ ఇద్దరు నేతలు భేటీ అయ్యారు. చివరిసారిగా ఈ నేతలు రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో కలుసుకున్నారు.

2020లో గల్వాన్ లోయలో చోటుచేసుకున్న ఘర్షణల తర్వాత భారత్‌చైనా సంబంధాలు మళ్లీ సాధారణ స్థితికి రావడానికి ఈ భేటీ తోడ్పడుతుందని నిపుణులు భావిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలుపై ట్రంప్ విధించిన సుంకాల కారణంగా ఇరు దేశాలు ఒత్తిడికి గురవుతున్న సమయంలో ఈ సమావేశం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాని మోదీ, అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరిగిన ఈ చర్చల్లో ఇరు దేశాల సంబంధాలను మెరుగుపరుచుకోవడం ప్రధాన ఎజెండాగా ఉండనుంది.

**ప్రధాని మోదీ- జిన్‌పింగ్ భేటీలో ముఖ్యాంశాలు**

- ప్రధాని మోదీ , చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య సమావేశం 55 నిమిషాల పాటు కొనసాగింది.
- కైలాస మానస సరోవర్ యాత్ర తిరిగి ప్రారంభమైంది ప్రధాని మోదీ
- రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమానాలు కూడా ప్రారంభం కానున్నాయి ప్రధాని మోదీ
- శిఖరాగ్ర సమావేశం విజయవంతం అయినందుకు అభినందిస్తున్నాను జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ
- సంబంధాలను మెరుగుపరచుకోవడానికి కట్టుబడి ఉన్నాం జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ
- గత సంవత్సరం కజాన్‌లో అర్థవంతమైన చర్చలు జరిగాయి ప్రధాని మోదీ

## డేట్‌కు పిలిచి.. రూ. 9 లక్షల బిల్లు ఎగ్గొట్టి..

**హాంకాంగ్:** హాంకాంగ్‌లో విచిత్ర ఉదంతం వెలుగు చూసింది. రూ. 9 లక్షల డిన్నర్ బిల్లుతో పాటు 'డేట్'ను కూడా అక్కడే వదిలి వెళ్లిన హాంకాంగ్ 'లాయర్'ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హాంకాంగ్‌లో న్యాయవాదిగా చలామణీ అవుతూ, లగ్జరీ డిన్నర్‌కు భారీగా ఆర్డర్ ఇచ్చి, ఆ మొత్తాన్ని ఎగ్గొట్టడమే కాకుండా, డేట్‌ను కూడా అక్కడే వదిలి వెళ్లిన 23 ఏళ్ల యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతనితో డేట్‌కు వచ్చిన యువతి అతని పేరు వాంగ్ అని మాత్రమే తెలుసని పోలీసులకు వివరించింది. తనను ఒక విలాసవంతమైన రెస్టారెంట్‌లో వదిలివేసి, 80 వేల అమెరికన్ డాలర్లు (రూ.9 లక్షలు) చెల్లించకుండా వెళ్లిపోయాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఉదంతంలో పోలీసులు వాంగ్‌ను ట్సుంగ్ క్వాన్ ఓలో అదుపులోకి తీసుకున్నారు. ఘటన సమయంలో అతను ధరించినట్లు భావిస్తున్న దుస్తులను కూడా స్వాధీనం చేసుకున్నారు. 'ది స్టాండర్డ్' తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు సెంట్రల్ డిస్ట్రిక్ట్ క్రైమ్ యూనిట్ దర్యాప్తులో ఉన్నాడు. సెంట్రల్‌లోని మాండరిన్ ఓరియంటల్ హోటల్‌లో విందు కోసం ఒక యువతిని డేట్ కు వాంగ్ ఆహ్వానించాడు. ఆ సమయంలో వాంగ్ ఆమెకు తాను న్యాయవాదినని పరిచయం చేసుకున్నాడు. డిన్నర్ సమయంలో వారు అత్యంత ఖరీదైన షాంపైన్ బాటిల్‌ను ఆర్డర్ చేశారు. మొత్తం బిల్లు రూ. 9లక్షలకు పైగానే వచ్చింది. అయితే, ఆ బిల్లు చెల్లించే సమయానికి 'న్యాయవాది' వాష్‌రూమ్‌కు వెళ్లాలని 'డేట్'కు చెప్పి, అక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. ఆమె ఫోనులో అతన్ని సంప్రదించేందుకు ప్రయత్నించినా, ఫలితం లేకపోయింది. దీంతో ఆమె ఈ విషయాన్ని పోలీసులకు తెలిపింది. తరువాత ఆమె స్నేహితుల సహాయం కోరగా, వారు డిన్నర్ బిల్లు చెల్లించారు. 'డేట్' బాధితురాలి ఫిర్యాదు దరిమిలా పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, విచారిస్తున్నారు.



## అమెరికన్లపై ధరల పిడుగు

**వాషింగ్టన్:** అమెరికాను మళ్లీ గొప్పగా మార్చుతా (మేక్ అమెరికా గ్రేట్ ఎగేన్) నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్ తర్వాత అవలంభిస్తున్న వివాదాస్పద విదేశాంగ విధానాలతో సగటు అమెరికా పౌరుని జేబుకు భారీ చిల్లు పడుతోంది. దిగుమతి సుంకాలను ఎడాపెడా వాయించడంతో విదేశీ సరకులను అధిక ధరలకు కొనలేక అమెరికాలో సామాన్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ధరలను నేలకు దించుతానని బీరాలు పలికినట్రంప్ చివరకు ధరలను ఆకాశానికి ఎత్తేసి పలు రకాల సరకులను కొనలేని దుస్థితికి తీసుకొచ్చాడని దేశవ్యాప్తంగా అమెరికన్లు ట్రంప్‌పై కారాలు మిరియాలు నూరుతున్నారు. విదేశీ సరకులపై ఇలాగే అధిక టారిఫ్‌ల భారం కొనసాగితే అంతకు మించిన ధరల భారం శాశ్వతంగా మోయాల్సి వస్తుందన్న భయాందోళనలు స్థానికంగా అధికమయ్యాయి. మార్కెట్ రంగ నిపుణులు సైతం ఇదే పాటపాడటం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.



**తొలిరోజే తగ్గిస్తానని చెప్పి..**

'అధికారంలోకి రాగానే తొలిరోజే ద్రవ్యోల్బణం తగ్గిస్తా. ధరలను కిందకు తీసుకొస్తా''అని ఎన్నికల ప్రచారం వేళ 2024 ఆగస్ట్ ర్యాలీలో ట్రంప్ చేసి వాగ్దానాలు నీటిమూటలేనని ఇటీవల ప్రజలకు స్పష్టంగా తెలిసొచ్చింది. ''అమెరికా సరకులు అందుబాటు ధరల్లో''అనే నినాదం కాస్తా ''కొనలేనంత అధిక ధరలకు అమెరికా సరకులు''అనే పరిస్థితి దాపురించింది. దీనికి తాజా గణాంకాలే తార్కాణంగా నిలుస్తున్నాయి. జనవరిలో ట్రంప్ అధికారపగ్గాలు చేపట్టినప్పటి నుంచి లెక్కిస్తే ఆర్థిక డేటా, నిపుణుల విశ్లేషణల ప్రకారం గృహోపవస వస్తువులు మరీ ముఖ్యంగా నిత్యావసర సరకులు, విద్యుత్ ధరలు బాగా పెరిగిపోయాయి. ఇవి ఎప్పటికప్పుడు పెరుగుతూ లక్షలాది సగటు అమెరికన్లను మరింతగా ఆర్థిక కష్టాల్లోకి నెట్టేస్తున్నాయి. ఈ ధరల మోతకు పరోక్షంగా 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్'సైతం ఆజ్యంపోసిందని కొందరు ఆర్థికనిపుణులు విశ్లేసిస్తున్నారు. ఇవిగాక 800 డాలర్ల విలువైన సరకులను ఎలాంటి టారిఫ్, సుంకాలు, డ్యూటీలు, ఫీజులు లేకుండా దిగుమతి చేసుకునే 'డీ మినిమిస్'నిబంధననూ ట్రంప్ సర్కార్ తొలగించింది. దీంతో హఠాత్తుగా డిమాండ్ పెరిగి, ఆన్‌లైన్‌లో దొరికే తక్కువ ధర ఉండే వస్తువుల రేట్లు సైతం పెరిగిపోయాయి.

**పోస్టల్ సేవల నిరాకరణతో రేట్లు పైపైకి..**

అమెరికాకు డెలివరీ చేసేందుకు వస్తువుల ఆర్డర్‌లను తీసుకోవడం భారత్‌లో 'ఇండియాపోస్ట్'ఆపేసింది. ఇండియాపోస్ట్ బాటలోనే 25 దేశాల్లోని పోస్టల్ సంస్థలు నడుస్తున్నాయి. దీంతో ఆయా దేశాల నుంచి పోస్టల్ ద్వారా అమెరికాకు డెలివరీ కావాల్సిన సరకుల భటాఫ్‌వడా పూర్తిగా ఆగిపోయింది. దీంతో ఆయా దేశాల్లోని సంస్థలు ఇతరత్రా కొత్త డెలివరీ సంస్థల సాయంతో అమెరికాలోకి వస్తువులను డెలివరీ చేస్తున్నాయి. కొత్త సంస్థలు కావడంతో డెలివరీ చార్జీల మోత తప్పట్లేదు. ఈ పెరుగుదల చివరకు అమెరికా వినియోగదారునిపై పడుతోంది.

**పచారీ సామాను ధరలు..**

అన్నింటికంటే ఎక్కువగా నిత్యావసర సరకుల ధరలు బాగా పెరిగాయి. జూన్-జులైలో అన్ని ఆహారాల వినియోగధరల సూచీ (సీపీఐ) కాస్తంత పెరిగింది. దీంతో రిటైల్ ధరలు అధికమయ్యాయి. గత 20 ఏళ్ల చరిత్రలో సగటున ఆహార ధరలు 2.9 శాతం పెరగ్గా తాజా అంచనాల ప్రకారం ఈ ఏడాది చివరికల్లా ఇది 3.4 శాతానికి చేరుకోనుందని విశ్లేషకులు చెప్పారు. పెరుగుతున్న ధరలకు స్థానిక పరిస్థితులు సైతం తోడయ్యాయి. ఏవియాన్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ దెబ్బకు కోళ్ల పరిశ్రమ కునారిల్లింది. దీంతో గుడ్ల ధరలు పెరిగాయి. గొడ్డుమాంసం ధర సైతం హెచ్చింది. తాజా సర్వే ప్రకారం పెరిగిన ధరలతో సతమతమవుతున్నామని 30వేల డాలర్ల వార్షికాదాయం ఉన్న 64 శాతం మంది కుటుంబాలు చెప్పాయి. చైనా, మెక్సికో, కెనడా ఆహారోత్పత్తులపై అమెరికన్లు బాగా ఆధారపడ్డారు. 2023లో 195.9 బిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయోత్పత్తులను అమెరికా దిగుమతి చేసుకుంటే అందులో 44 శాతం దిగుమతులు కేవలం చైనా, కెనడా, మెక్సికో నుంచే వచ్చాయి. ఇప్పుడీ మూడు దేశాలపై అధిక టారిఫ్ మోపడంతో ఆమేరకు దిగుమతి సుంకాల రూపంలో ధరలు పెరిగి అమెరికన్ వినియోగదారుల చిల్లుకు పెద్ద చిల్లుపడుతోందని 'యేల్ బడ్జెట్ ల్యాబ్'సంస్థ పేర్కొంది. హోల్‌సేల్, రిటైలర్లు ఈ టారిఫ్ భారాన్ని తాము భరించకుండా వినియోగదారులపై పడేయడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని 9ఐ క్యాపిటల్ గ్రూప్ సీఈఓ కెవిన్ థాంప్సన్ అన్నారు.



### సక్సెస్ అంటే డబ్బు, పేరు కాదు..
## అలాంటి సినిమాలు చేయాలనుంది!

**రకుల్ ప్రీత్ సింగ్.. పేరు వినగానే, హీరోయిన్‌గానే కాకుండా ఫిట్‌నెస్ అండ్ హెల్త్ గుర్తొస్తుంది. ఆమె గురించి తెలుసుకోవాలంటే ఎప్పటికప్పుడు కొత్త విషయాలు ఉంటూనే ఉంటాయి. నటిగానే కాకుండా ఆమె ఫిట్‌నెస్, డ్యాన్స్, స్పోర్ట్స్, సోషల్ యాక్టివిటీస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌లో తనకంటూ ప్రత్యేకతను ఏర్పరచుకుంది. రకుల్ గురించి ఇంకొన్ని విషయాలు...**

#### నాన్న ఆర్మీ ఆఫీసర్

రకుల్ ప్రీత్ సింగ్ న్యూఢిల్లీలోని సిక్కు కుటుంబంలో పుట్టింది. ఆమె తండ్రి కుల్వీందర్ సింగ్ ఆర్మీ ఆఫీసర్‌గా పని చేసేవారు. దాంతో ఆమె ఆర్మీ స్కూల్‌లోనే స్కూలింగ్ చేసి, ఆపైన జీసస్ అండ్ మేరీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. రకుల్ ప్రీత్ జాతీయ స్థాయి గోల్ఫ్ ప్లేయర్. అంతేకాదు, ఎంతో ఆసక్తితో భరతనాట్యం కూడా నేర్చుకుంది. అలాగే ఆమెకు గుర్రపు స్వారీ చేయడం కూడా చాలా ఇష్టం.

#### మోడలింగ్

మోడలింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్నాక, రకుల్ 18 ఏళ్లకే కన్నడ సినిమా 'గిల్లి' ద్వారా ఫిల్మ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో నటించి.. ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్ల జాబితాలో చేరిపోయింది. 'ఫెమినా' మిస్ ఇండియా-2011లో రకుల్ ఐదో స్థానంలో నిలిచింది. అందులోనే పాంటలూన్స్ మిస్ ఫ్రెష్ ఫేస్, ఫెమినా మిస్ టాలెంటెడ్, మిస్ బ్యూటిఫుల్ స్మైల్, మిస్ బ్యూటిఫుల్ ఐస్, పీపుల్స్ చాయిస్ మిస్ ఇండియా టైమ్స్ వంటి టైటిల్స్ గెలుచుకుంది.

#### కోవిడ్ టైంలో..

'మనకంటూ ప్రత్యేకంగా టైమ్ కేటాయించుకోవాలి. ఎవరి సంతోషం వాళ్ల చేతుల్లోనే ఉంటుంది. దానికోసం ఎవరిపైనా ఆధారపడొద్దు' అన్నది రకుల్ అభిప్రాయం. రకుల్ తన సామాజిక బాధ్యతను ఎప్పుడూ మరిచిపోలేదు. కోవిడ్ సమయంలో వంద కుటుంబాలను ఆదుకోవడమే కాకుండా, క్రౌడ్ ఫండింగ్ చేసి పేదలకు డొనేషన్స్ అందించింది. 2017లో రకుల్ 'తెలంగాణ బేటీ బచావో, బేటీ పఢావో' ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్‌గా అపాయింట్ అయింది.

#### నాన్న నుంచే వచ్చాయి..

2024లో తను ప్రేమించిన జాక్కీ భగ్నానీ (Jackky Bhagnani)ని గోవాలో వివాహం చేసుకుంది. మొదట ఓవర్సీస్‌లో పెళ్లి వేడుకలు జరపాలనుకున్నారట! కాని, దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడాలనే ఆలోచనతో గోవాలోనే ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. 'సక్సెస్ అంటే పేరు, డబ్బు కాదు. మనసుకు నచ్చిన పని చేస్తూ ప్రశాంతమైన జీవితాన్ని గడపడం. చిన్నప్పటి నుంచి నాన్న నుంచి వచ్చిన డిసిప్లిన్, పంక్చువాలిటీ నన్ను ఎప్పటికీ హ్యాపీ లైఫ్ వైపే తీసుకెళ్తాయి.

#### ఇష్టం

దానివల్లే చేయాల్సిన పనిలో రెండు నిమిషాలు ఆలస్యమైనా నాకు ప్యానిక్ అటాక్ వచ్చేస్తుంది. సోషల్ ఎంటర్‌టైనర్స్ చేయడం నాకు చాలా ఇష్టం. వాటితో సమానంగా సోషల్ రెస్పాన్సిబుల్ సినిమాలూ చేయాలని ఉంది. ఫ్యాషన్, డ్రెస్సింగ్ విషయానికొస్తే, నాకు ఏది కంఫర్ట్ ఉంటే అదే ఎంచుకుంటాను' అని చెబుతుంది



### మరో నటితో మాజీ బాయ్‌ఫ్రెండ్ విజయ్ వర్మ..
## మిల్కీ బ్యూటీ రియాక్షన్!

సినీ ఇండస్ట్రీలో మిల్కీ బ్యూటీగా పేరు సంపాదించుకున్న ముద్దుగుమ్మ తమన్నా. ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. హిందీ చిత్రాల్లో నటించిన ముద్దుగుమ్మ.. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో స్టార్ హీరోయిన్‌గా రాణించింది. ఈ ఏడాది ఓదెల 2 మూవీతో అలరించిన భామ.. ప్రస్తుతం డూ యూ వన్నా పార్ట్‌నర్ అనే వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే గతంలో బాలీవుడ్ నటుడు విజయ్‌వర్మ ప్రేమాయణం నడిపింది. అతనితో కొన్నినెలల పాటు డేటింగ్ చేసిన తమన్నా.. ఆ తర్వాత బ్రేకప్ చెప్పేసింది. ప్రస్తుతం వీరిద్దరు తమ సినీ లైఫ్‌లో బిజీగా ఉన్నారు. అయితే ఇటీవల తమ మాజీ బాయ్‌ఫ్రెండ్ విజయ్ వర్మ మరో నటితో షికార్లు చేస్తూ సోషల్ మీడియాలో కనిపించారు. ఈ ఫోటోలు నెట్టింట తెగ వైరలయ్యాయి. తాజాగా ఈ విషయంపై మిల్కీ బ్యూటీని ప్రశ్నించగా తమన్నా రియాక్ట్ అయింది. విజయ్ వర్మతో తనకు బ్రేకప్ అయ్యి చాలా రోజులైందని తెలిపింది. అలాంటప్పుడు అతను ఎవరితో తిరిగితే నాకేంటిని కామెంట్స్ చేసింది. అతను ఎవరిని ప్రేమిస్తే తనకు ఏంటి అంటూ మాట్లాడింది. విజయ్ వర్మను ఉద్దేశించి తమన్నా చేసిన వ్యాఖ్యలు బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

## ఆఫ్రికాలో అడ్వెంచర్?



హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ చిత్రం రూ పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఆఫ్రికా లొకేషన్స్‌లోనే జరుగుతోందనే ప్రచారం సాగుతోంది. దానికి కారణం ప్రియాంకా చోప్రా తాజాగా షేర్ చేసిన కొన్ని ఫొటోలు ప్రధానంగా ఫారెస్ట్ లొకేషన్స్‌కు సంబంధించినవి కావడమే. దీంతో ఆమె ప్రస్తుతం ఆఫ్రికాలో ఉన్నారని, ఆమె అక్కడికి వెళ్లింది మహేశ్‌బాబు సినిమా కోసమే అనే టాక్ తెరపైకి వచ్చింది. మరోవైపు మహేశ్‌బాబు భార్య నమ్రత వినాయక చవితి పండగ జరుపుకున్న ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేసి, మహేశ్‌బాబును మిస్ అవుతున్నట్లుగా పేర్కొన్నారు. సో... మహేశ్‌బాబు కూడా రాజమౌళి సినిమా షూటింగ్ కోసం ఆఫ్రికా వెళ్లారనే ఊహాగానాలు నెలకొన్నాయి. ఇక ఈ షెడ్యూల్‌లో మహేశ్‌బాబుపై ఓ భారీ యాక్షన్ అడ్వెంచరస్ సీక్వెన్స్ చిత్రీకరించడానికి ప్లాన్ చేశారట రాజమౌళి. ఇక కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాకి ఓ హాలీవుడ్ నిర్మాణ సంస్థ కూడా నిర్మాణంలో భాగస్వామి కానుందనే ప్రచారం జరుగుతోంది.

## అల్లు ఫ్యామిలీని పరమర్శించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌ను పరామర్శించారు. శనివారం అల్లు అరవింద్ తల్లి, దివంగత అల్లు రామలింగయ్య సతీమణి అల్లు కనకరత్నం గారు కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ అల్లు అరవింద్ ఇంటికి వెళ్లి అల్లు అరవింద్‌ను అల్లు అర్జున్‌ని వారి కుటుంబాన్ని ఓదార్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

## థాంక్యూ జగన్ గారు..
### అల్లు అర్జున్ ట్వీట్ వైరల్



ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తల్లి, అల్లు అర్జున్ నాన్నమ్మ కనకరత్నమ్మ(94) మృతి చెందిన సంగతి తెలిసిందే. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. కనకరత్నమ్మ మృతి విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎక్స్ వేదికగా సంతాపం ప్రకటించారు. 'దివంగత సీనియర్ నటులు అల్లు రామలింగయ్య సతీమణి, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తల్లి కనకరత్నమ్మ గారు మృతి చెందడం బాధాకరం. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. వైఎస్ జగన్ సంతాప ప్రకటనపై అల్లు అర్జున్ స్పందించాడు. 'సంతాపం ప్రకటించినందుకు థ్యాంక్యూ జగన్ గారు. మీ మంచి మాటలు, మద్దతుకు మేము నిజంగా కృతజ్ఞులం' అని బన్నీ ట్వీట్ చేశాడు. ప్రస్తుతం బన్నీ ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com